# నేటి నిజం

తెలుగు దినపత్రిక

E-mail : netinijam93@gmail.com

website:www.netinijam.com

హైదరాబాద్ ఆదివారం 6-11-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 72 పేజీలు:6 వెల: రూ.1/-


## జవహర్ నగర్‌లో తీవ్ర విషాదం.. చెరువులో పడి ఆరుగురు మృతి

హైదరాబాద్, నవంబర్ 5:జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో తీవ్ర విషాదం నెలకొంది. మల్కారం గ్రామ పరిధిలోని ఎర్రకుంట చెరువులో పడి ఆరుగురు చనిపోయారు. మొదట ఐదుగురు విద్యార్థులు చెరువులో దిగి ఈత కొట్టేందుకు యత్నించారు. ఈ క్రమంలో చెరువు మధ్యలోకి వెళ్లి నీట మునిగారు. ఒడ్డున ఉన్న ఉపాధ్యాయుడు.. నీటిలో మునుగుతున్న విద్యార్థులను గమనించాడు. వారిని కాపాడేందుకు ఉపాధ్యాయుడు కూడా చెరువులోకి దూకాడు.

విద్యార్థులను కాపాడే క్రమంలో టీచర్ కూడా ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న స్థానికులు, పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాలను వెలికితీశారు. చనిపోయిన పిల్లలందరూ 12 నుంచి 14 ఏండ్ల లోపు వారేనని పోలీసులు తెలిపారు. మృతులను అంబర్‌పేటలోని మదర్సా విద్యార్థులుగా పోలీసులు గుర్తించారు. విద్యార్థుల, ఉపాధ్యాయుడి కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

## రైతు హామీల అమలుకు దేశవ్యాప్తంగా ఛలో రాజ్ భవన్

హైదరాబాద్, నవంబర్ 5: కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం రైతాంగానికి రాత పూర్వకంగా ఇచ్చిన హామీల అమలు కోసం ఈనెల 26న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఛలో రాజ్‌భవన్ కు రైతులు భారీగా తరలిరావాలని అఖిల భారత రైతు పోరాట సమన్వయ కమిటీ, సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఛలో రాజ్‌భవన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

నాయకులు సాగర్, పశ్యపద్మ, ఉపేందర్‌రెడ్డి మండల వెంకన్న మాట్లాడుతూ చారిత్రక రైతు పోరాటానికి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్ర గవర్నర్లకు సమస్యలతో కూడిన మెమోరాండాలను అందిస్తామన్నారు. నాడు రైతు ఆందోళనకు స్పందించిన ప్రధాని రైతులకు క్షమాపణ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. రైతులకిచ్చిన హామీలను అమలు కోరుతూ దేశవ్యాప్తంగా ఉన్న రాజ్‌భవన్‌ల ఎదుట ఆందోళనలు, వినతిపత్రాల సమర్పణ చేపట్టనున్నామని పేర్కొన్నారు.

రైతాంగం పండించిన పంటలకు కనీస మద్దతు ధరల కోసం పార్లమెంటులో చట్టం చేయాలని, స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం సీ 2050 అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగానికి ఉన్న రుణాలన్నింటినీ ఏకకాలంలో మాఫీ చేయాలని, రుణ విమోచన చట్టం తేవాలన్నారు. విద్యుత్ సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించు కోవాలని, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని సవరించి అమలు చేయాలని కోరారు. రైతు ఉద్యమంలో మరణించిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని, రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

## తమిళనాడులో దంచికొడుతున్న వానలు.. 26కు పెరిగిన మృతులు

చెన్నై, నవంబర్ 5: ఈశాన్య రుతుపవనాల ప్రవేశం అనంతరం తమిళనాడులో వర్షాలు దంచికొడుతున్నాయి. వానల కారణంగా మరో ముగ్గురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. దీంతో రాష్ట్రంలో వర్షాల కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 26కి చేరింది. చెన్నైలో శనివారం ఇద్దరు ప్రాణాలు కోల్పోగా.. తిరువళ్లూరు జిల్లాలో మరొకరు మరణించారు. మృతుల కుటుంబాలకు రూ.4లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు అధికారులు. మృతుల కుటుంబాలకు సీఎం స్టాలి సంతాపం ప్రకటించారు. ఈశాన్య రుతుపవనాలు అక్టోబర్ 29న ప్రవేశించాయి.

గత 24 గంటల్లో తమిళనాడులో పది సెంటీమీటర్లకుపైగా వర్షాపాతం రికార్డయ్యింది. నాగపట్నం జిల్లాలోని కొడియాకరై స్టేషన్‌లో అత్యధికంగా 9 సెంటీమీటర్లు, రామేశ్వరం (రామనాథపురం)లో ఎనిమిది, కొట్టారం (కన్యాకుమారి), కులశేఖరపట్టణం (తూత్తుకుడి)లో 7 సెంటీమీటర్ల చొప్పున వర్షం కురిసింది. శుక్రవారం కురిసిన వర్షాలకు 140 గుడిసెలు దెబ్బతిన్నాయని ప్రభుత్వం తెలిపింది. 4న చెన్నైలో నేలకూలిన 64 చెట్లను తొలగించారు. వర్షాల కారణంగా ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు రూ.4లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీఎం స్టాలిన్ ఆదేశించారు. మంత్రులు కేఎన్ నెహ్రూ, పీకే శేఖర్‌బాబు స్వయంగా మృతుల కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు.

## ఏడాది వయసున్న పాప కిడ్నాప్ 48 గంటల్లో ఛేదించిన పోలీసులు

ముంబై, నవంబర్ 5:ఏడాది వయసున్న పాప కిడ్నాప్ అయ్యింది. ఫిర్యాదుపై స్పందించిన పోలీసులు 48 గంటల్లో కేసును ఛేదించారు. పాప ఆచూకీని కనిపెట్టి కిడ్నాపర్ల నుంచి రక్షించి స్వాధీనం చేసుకున్నారు. తల్లికి ఆ చిన్నారిని అప్పగించారు. మహారాష్ట్ర రాజధాని ముంబైలో ఈ సంఘటన జరిగింది. శాంతాక్రజ్ ప్రాంతంలో రోడ్డు పక్కన తల్లితోపాటు నిద్రిస్తున్న ఏడాది వయసున్న బాలికను ఒక మహిళ అపహరించింది. పాప కనిపించకపోవడంతో ఆ చిన్నారి తల్లి పోలీసులను ఆశ్రయించింది.

కాగా, ఫిర్యాదు అందుకున్న పోలీసులు వెంటనే స్పందించారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలించారు. పాపను కిడ్నాప్ చేసిన మహిళ, మరో వ్యక్తి రైలులో సోలాపూర్ వెళ్లినట్లు గ్రహించారు. సోలాపూర్ రైల్వే స్టేషన్‌లోని పోలీసులను అప్రమత్తం చేశారు. ఆ మహిళ నుంచి పాపను స్వాధీనం చేసుకున్నారు. ముంబైకి తీసుకువచ్చి తల్లికి అప్పగించారు. ఆ చిన్నారి కిడ్నాప్‌నకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. పాప కిడ్నాప్ కేసును 48 గంటల్లో ఛేదించి ఆమె తల్లికి అప్పగించినట్లు ముంబై పోలీస్ కమిషనర్ వివేక్ తెలిపారు.

### చరిత్రలో నేటినిజం




కం॥ మన భారత దేశమునకు
ఘన రెడి ఫుట్బాలు లోన ఘను గౌరవమున్
ఘన 'సంగ్రామ ముఖర్జీ'
...కొని యందించె జనులు మోదమునొందన్

(నవంబర్ 6 సంగ్రాం ముఖర్జీ జననం)

–రాధశ్రీ

సెల్:9494481210



నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

## కోయంబత్తూర్‌లో కేసీఆర్ మోడల్‌పై సెమినార్.. పెద్ద ఎత్తున్న పాల్గొన్న రైతులు




చెన్నై, నవంబర్ 5: తమిళనాడులోని కోయంబత్తూరులో చాంబర్ ఆఫ్ కామర్స్ మీటింగ్ హాల్లో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ మోడల్‌పై ఇవాళ చర్చా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దక్షిణ భారత రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు కోటపాటి నరసింహం నాయుడు పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న రైతు అనుకూల పథకాలు, వివిధ రంగాల్లో జరుగుతున్న అభివృద్ధిని ఆయన వివరించారు. వ్యవసాయ రంగంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. అన్ని రంగాల్లో తెలంగాణ అగ్రగామిగా నిలిచిందని, ఈ ఎనిమిదేండ్లలో ఎంతో పురోగతి సాధించిందని స్పష్టం చేశారు. కేసీఆర్ నాయకత్వంలో రైతులు తమ ఆర్థిక స్థితిని గణనీయంగా పెంచుకున్నారని తెలిపారు. అడవులు పెంచి, పర్యావరణాన్ని కాపాడడంతో వర్షాలు సమృద్ధిగా కురుస్తున్న విషయాన్ని తెలిపారు. తెలంగాణ తలసరి ఆదాయం దేశంతో పోలిస్తే రెట్టింపు స్థాయిలో ఉందన్నారు.

దక్షిణ భారత రైతు సమాఖ్య ప్రధాన కార్యదర్శి పీకే దైవ శిగామణి అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. గత నెలలో తెలంగాణలో పర్యటించిన రైతులు.. కేసీఆర్‌తో రెండు రోజుల పాటు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అయితే తమిళనాడులో ప్రజలను, రైతులను చైతన్యవంతం చేసి కేసీఆర్ మోడల్ తమిళనాడులో అమలయ్యే వరకు నిరసన కార్యక్రమాలు చేపడుతామని ప్రకటించారు. ఈ మేరకు కార్యాచరణ ప్రకటించారు. మొదటగా తమిళనాడులోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలందరికీ లేఖలు రాసి కేసీఆర్ మోడల్ అమలు చేయాలని డిమాండ్ చేస్తామన్నారు. అనంతరం కన్యాకుమారి నుంచి చెన్నై వరకు వేలాది మంది రైతులతో పాదయాత్ర చేస్తామన్నారు.

## నేగి స్వగ్రామానికి వెళ్లి నివాళులర్పించిన సీఈసీ రాజీవ్ కుమార్



న్యూఢిల్లీ, నవంబర్ 5:స్వతంత్ర భారతదేశంలో మొదటి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న కురువృద్ధుడు శ్యామ్ శరణ్ నేగి (106)కి కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి (సీఈసీ) రాజీవ్‌కుమార్ నివాళులర్పించారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని నేగి స్వగ్రామమైన కల్పాకు వెళ్లిన రాజీవ్ కుమార్.. అక్కడ నేగి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు.

హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 2న శ్యామ్ శరణ్ నేగి పోస్టల్ బ్యాలెట్ ద్వారా తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదే అతడు వేసిన చివరి ఓటు అయ్యింది. దాంతో కలిపి నేగి తనకు ఓటు హక్కు వచ్చినప్పటి నుంచి మొత్తం 34 సార్లు ఓటు వేసినట్లయ్యింది. ఓటరుగా నమోదైంది మొదలు ఒక్కసారి కూడా మిస్‌కాకుండా ఓటు వేసిన నేగిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సీఈసీ పేర్కొన్నారు.

కాగా, గత కొంతకాలంగా వృద్ధాప్య సంబంధ సమస్యలతో బాధపడుతున్న నేగి.. ఇవాళ ఉదయం తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. నేగి అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించనున్నట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించారు.

## కౌంటింగ్ సెంటర్ వద్ద భారీ భద్రత.. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఏర్పాట్లు



హైదరాబాద్, నవంబర్ 5:మునుగోడు ఉప ఎన్నిక కౌంటింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాటు చేశారు. ఈవీఎం మేషీన్లు భద్రపరిచిన సెంటర్ల వద్ద పోలీసులు మూడంచెల భారీ భద్రత కల్పించినట్టు నల్లగొండ ఎస్పీ రెమా రాజేశ్వరి చెప్పారు. రేపు (ఆదివారం) ఉదయం అర్జాలభావిలోని వేర్ హౌసింగ్ గోడన్స్ వద్ద ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్‌లో నిర్వహించబోయే ప్రక్రియకు ఎట్లాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 470 మంది పోలీస్ సిబ్బంది, మూడు కేంద్ర కంపెనీ బలగాలతో భద్రత ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు.

ఈ క్రమంలో కౌంటింగ్ సెంటర్ వద్ద కు వచ్చే అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లు తమ వాహనాలకు లక్ష్మి గార్డెన్స్ వద్ద పార్కింగ్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఎన్నికల అధికారులు ఏర్పాటు చేసిన బస్ లలో కౌంటింగ్ సెంటర్ వద్దకు రావాలని సూచించారు. కౌంటింగ్ సెంటర్ కి వచ్చే అభ్యర్థులు జిల్లా ఎన్నికల అధికారి జారీచేసిన ఐడీ కార్డులు తప్పకుండా తీసుకురావాలన్నారు. ఇక.. ఎవరూ కూడా ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్ ఫోన్స్, లాప్ టాప్, ఎలాక్ట్రానిక్ వాచెస్, వీడియో కెమెరాలు తమ వెంట తీసుకురావొద్దని, స్ట్రిక్ట్‌గా రూల్స్ ఉంటాయని రెమా రాజేశ్వరి తెలిపారు.

## శ్రీవారి ఆలయంలో వేడుకగా కైశికద్వాదశి ఆస్థానం

తిరుమల, నవంబర్ 5: కైశిక ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీవారి ఆలయంలో శనివారం కైశిక ద్వాదశి ఆస్థానం వేడుకగా జరిగింది.

ఈ సందర్భంగా ఉదయం 4.30 నుంచి 5.30 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ఉగ్రశ్రీనివాసమూర్తిని ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. వేంకటతురైవార్, స్నపనబేరంగా పిలిచే ఉగ్రశ్రీనివాసమూర్తిని శ్రీదేవి భూదేవి సమేతంగా ఒక్క కైశిక ద్వాదశి రోజు మాత్రమే సూర్యోదయానికి ముందు మాడవీధులలో ఊరేగిస్తారని వేదపండితులు తెలిపారు.

అనంతరం స్వామి, అమ్మవార్లను బంగారువాకిలి చెంత వేంచేపు చేసి అర్చకులు పురాణ పఠనంతో కైశిక ద్వాదశి ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పెద్ద జీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఈవో ఎవి.ధర్మారెడ్డి, ఆలయ డిప్యూటీ ఈవో రమేష్ బాబు, వీజీవో బాలిరెడ్డి పాల్గొన్నారు

ఎస్వీ గోసంరక్షణ ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళం

భువనేశ్వర్‌కు చెందిన శివం కాండెవ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ శనివారం ఎస్వీ గోసంరక్షణ ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళం అందించింది.

ఈ మేరకు విరాళం డీడీని తిరుమల అన్నమయ్య భవనంలో ఆ సంస్థ ప్రతినిధి రాఘవేంద్ర ఈవో ఎవి.ధర్మారెడ్డికి అందజేశారు. ఈ సంస్థ తరఫున ఇప్పటివరకు రూ.3 కోట్లు విరాళం ఇచ్చినట్టు దాత తెలిపారు.

## అటు క్షిపణుల హోరు, ఇటు మరణ మృదంగం.. తొక్కిసలాటలో 150 మందికి పైగా మృతి

న్యూఢిల్లీ, నవంబర్ 5: దక్షిణ కొరియా రాజధాని. అక్కడ ఏటా హాలోవిన్ ఉత్సవాలు చేస్తుంటారు. సెయింట్స్, ఇతర మతాధిపతులను సంస్మరించుకునేందుకు జరిగే ఉత్సవం అది. ఈ ఏడాది ఆ ఉత్సవానికి వేలాది మందిహాజరు కావడంతో తొక్కిసలాట జరిగి 150 మందిపైగా మరణించారు. పవిత్రమైన ఉత్సవం సందర్భంగా ఈ దుర్ఘటన చోటు చేసుకోవడంచాలా మందిని కలిచివేసింది. సియోల్‌లో ఉత్తర కొరియా నుంచి క్షిపణి దాడులు హోరెత్తిస్తున్న సమయంలోనే ఈ దుర్ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. దీంతో మీడియాలో ఇందుకు సంబంధించి సరైన సమాచారం ప్రచారం కాలేదు. సియోల్ సమీపంలో చిన్న పట్టణంలాంటి శివారు ప్రాంతంలో ఈ ఉత్సవ వేడుకలు జరిగాయి, ఆ శివారు ప్రాంతంలో వీధులన్నీ ఇరుకైనవి,అక్కడే రెస్టారెంట్లు, బార్లు ఉన్నాయి. అవన్నీ జనంతో కిక్కిరిసిపోయాయి. జనాన్నిఅదుపు చేసేందుకు పోలీసులు సరైన చర్యలు తీసుకోలేదని ఉత్సవ నిర్వాహకులు ఆరోపిస్తున్నారు. ఏటా ఈ ఉత్సవాలకు అధిక సంఖ్యలో జనం రావడం మామూలేననీ, కిందటి సంవత్సరం కూడాఇదే మాదిరిగా భారీ సంఖ్యలో వచ్చారని వారు చెబుతున్నారు. శివారు ప్రాంతానికి ఇటావన్ మెట్రో స్టేషన్ ఉంది. ఆ స్టేషన్‌లో కూడా జనం కిక్కిరిసి ఉన్నారు. ఆ గుంపులో న్యూహిల్ అహ్మద్ అనే యువకుడు ఉన్నాడు.

అతడు భారతీయుడు. ఐటి ఉద్యోగం చేస్తున్నాడు. ఈ దుర్ఘటనగత శనివారం నాడు జరిగింది.సాయంత్రం ఐదు గంటల నుంచి వచ్చే జనం సంఖ్య పెరిగిందనీ, వారిని అదుపు చేసేందుకు పోలీసులు తగిన ఏర్పాట్లు చేయలేదని అతడు అన్నాడు. ఈ జనం గుంపులుగా రావడం ఒక ఎత్తయితే, ఈ ప్రాంతంలో తొక్కిసలాట జరుగుతోందంటూ సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వార్తలు జనాన్ని ఆందోళనకు గురి చేశాయని అహ్మద్ చెప్పాడు.

ఆ ప్రాంతంలో పెద్ద శబ్దాలు వినిపించేసరికి ఉత్తర కొరియా బాంబులు వేసిందేమోనన్న భయంతోజనం పరుగులు తీశారు. తొక్కిసలాటకు కారణంఇదే. సామాజిక మాధ్యమాలపై ప్రభుత్వానికి నియంత్రణ లేదు. దాంతో సోషల్ మీడియాలో పలు రకాల కథనాలు వెలువడ్డాయి. ప్రజల్లో ఆందోళనలు పెరగడానికిఅది కూడాఒక కారణం.

నిజానికి హాలోవిన్ ఉత్సవాలను చూసేందుకు మాత్రమే జనం రాలేదు. మన దేశంలో మాదిరిగానేఇలాంటి ఉత్సవాల పేరుచెప్పి సమూహాలు ఒక ప్రాంతంలో చేరుకోవడం, ఒకరినొకరు పరిచయం చేసుకోవడం మామూలే. మొదట్లో ఇది చాలా తక్కువ స్థాయిలో ఉండేది. జనంపెరగడంతో వ్యాపారాలు పెరిగాయి. బార్‌లు, రెస్టారెట్లు వెలిశాయి. మృతుల్లో ఎక్కువ మంది యువతీయువకులే. ఇరవై ఏళ్ళ వయసు వారే. మృతుల్లో కొరియా నటుడు లీ జిహాన్ కూడా ఉన్నాడు. అతడి వయసు 24 సంవత్సరాలు. అలాగే, ఈ దుర్ఘటనలో మరణించిన వారిలో ఇద్దరు అమెరికన్లు, ఆస్ట్రేలియన్లుఇద్దరుఉన్నారు. వీరంతా వారాంతపు సెలవులలో ఈ ఉత్సవాలను తిలకించేందుకు సియోల్ చేరుకున్నారు. సియోల్ ప్రభుత్వం విదేశాల నుంచి వచ్చినవారికి తగిన భద్రతాఏర్పాట్లను చేయలేదని పర్యాటకులు ఆరోపించారు. ఇందుకు సియోల్ ప్రభుత్వం బాధ్యత వహించాలని పర్యాటకులు డిమాండ్ చేస్తున్నారు.

## భారతదేశం లోని డల్ సరస్సులో నిర్వహించినందుకు గాను ఐపిపిబి ని ప్రశంసించిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, నవంబర్ 5:'నివేశక్ దీదీ' కార్యక్రమం లో భాగం గా 'నీటి మీద తేలియాడే ఆర్థిక అక్షరాస్యత సంబంధి ఒకటో శిబిరాన్ని' భారతదేశం లో గల జమ్ము మరియు కశ్మీర్ లోని శ్రీనగర్ లో నెలకొన్న డల్ సరస్సు లో నిర్వహించినందుకు ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపిపిబి) ని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ మెచ్చుకొన్నారు.

ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ చేసిన ఒక ట్వీట్ కు ప్రధాన మంత్రి సమాధానాన్ని ఇస్తూ,

"అద్భుతమైనటువంటి కార్యక్రమం.. ఇది మహిళ ల యొక్క సశక్తీకరణ ను మరింత గా బలపరుస్తుంది." అని పేర్కొన్నారు.




# మల్లికార్జునుడు కాంగ్రెస్ హస్తరేఖల్ని మార్చగలడా..!

## (మల్లికార్జున ఖర్గే 'భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడి'గా ఎన్నికై బాధ్యతలు చేపట్టిన సందర్భంగా)

కర్నాటక రాష్ట్ర బీదర్ జిల్లా బాల్కీ తాలూకా వరవట్టి గ్రామంలో 21 జూలై 1942న జన్మించిన మల్లికార్జున ఖర్గే జీవితంలో పలు ఎత్తుపల్లాలు చవిచూచారు. మిల్లులో కార్మికుడిగా పని చేసే వారు ఖర్గే తండ్రి. తమ గ్రామం నాటి హైదరాబాదు నిజాం పాలనలో రజాకార్ల ఆగడాలలో నలిగి పోయింది. చిన్నతనంలోనే రజాకార్ల మత కల్లోల విధ్వంసాగ్నిలో ఖర్గే నివాస గృహం అగ్నికి ఆహుతికావడం, ఆ మంటల్లో తల్లి, సోదరి ప్రాణాలు కోల్పోవడం జరిగింది. నాటి హింసాత్మక ఘటనల నుంచి రక్షణ పొందడానికి ఐదు ఏండ్లు తమ నివాసాలను మార్చుకుంటూ వలసల బతుకుల్ని గడిపింది వారు కుటుంబం. మతకలహాల అనుభవాలతో ఎదిగిన మల్లికార్జున ఖర్గే లౌకికవాదం వైపు మొగ్గు చూపారు. ఇందిరా గాంధీ కుటుంబానికి పరమ విధేయుడిగా పేరు తెచ్చుకున్న ఖర్గే తన పిల్లల పేర్లను రాహుల్, ప్రియాంక, ప్రియదర్శినిగా నామకరణం చేశారు. కుటుంబ పోషణ నిమిత్తం సినిమా హాల్‌లో పని చేసిన ఖర్గే కాళాశాలలో క్రీడాకారుడిగా కబడ్డీ, హాకీ క్రీడల్లో రాణించారు. సుప్రీంకోర్టు న్యాయవాది శివరాజ్ పాటిల్ మార్గనిర్దేశనంలో న్యాయవాదిగా కార్మిక సంబంధ కేసులను వాదించే వారు. భార్య రాధాబాయ్ చేతి మాంసాహారం, జొన్న రొట్టెలను ఇష్టంగా తినే మల్లికార్జున ఖర్గే ప్రజానాయకుడిగా, కర్నాటక అభివృద్ధి సాధకుడిగా చక్కటి పేరు తెచ్చుకున్నారు. ఇద్దరు కుమార్తెలు, ముగ్గురు కుమారులకు జన్మనిచ్చిన రాధాబాయ్–మల్లికార్జున ఖర్గే కుటుంబం నేటితరం రాజకీయ నాయకులకు మార్గనిర్దేశనం అవుతున్నదనడంలో అతిశయోక్తి లేదు.

### రాజకీయ ప్రస్థానం:

కన్నడ, హింది, తెలుగు, ఉర్దూ, మరాఠీ, ఆంగ్ల భాషల్లో అనర్గళంగా మాట్లాడగల ఖర్గే రాజకీయ నాయకుడిగా ఎదిగిన తీరు ప్రశంసానీయమే కాదు ప్రేరణాత్మకం కూడా. యస్ యస్ లహోటి లా కళాశాలలో విద్యార్థి సంఘ నాయకుడిగా తన నాయకత్వ ప్రతిభను ప్రదర్శించారు. ఇందిరాగాంధీ ప్రేరణతో 1969లో రాజకీయ ప్రవేశం చేసిన ఖర్గే యంయస్‌కె మిల్స్ యూనియన్‌కు న్యాయ సలహాదారుగా సేవలందించారు. కలబురగీ నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పని చేశారు. 1972లో తొలిసారి గుర్మిత్కల్ స్థానం నుంచి యం.యల్.ఏగా ప్రస్థానం ప్రారంభించి వరుసగా 9 సార్లు కర్నాటక శాసనసభకు ఎన్నికై 'అపజయమెరుగని నేత'గా పేరు తెచ్చుకున్నారు. రెండు పర్యాయాలు గుల్బర్గా/కలబురగీ నుంచి యంపీగా ఎన్నికైన ఖర్గే 2019 లోకసభ ఎన్నికల్లో తొలిసారి ఓటమి చవిచూశారు. కాంగ్రెస్ పార్టీకి, నెహ్రూ–గాంధీ కుటుంబానికి వీర విధేయుడైన మల్లికార్జునుడి సేవలను గుర్తించిన పార్టీ తనకు రాజ్యసభ సభ్యుడిగా అవకాశం ఇవ్వడమే కాకుండా రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యతలు అప్పగించారు.

### చేపట్టిన పదవులు:

కర్నాటక రాష్ట్రానికి ప్రాథమిక/మాధ్యమిక విద్యాశాఖ మంత్రి(1976–78)గా, గ్రామీణాభివృద్ధి మంత్రి(1978–80)గా, రెవిన్యూశాఖ మంత్రి(1980–83, 1990–92)గా, పంచాయతీరాజ్ మంత్రి(1979–80, 1990–92)గా, కాంగ్రెస్ లెజిస్లేటివ్ పార్టీ కార్యదర్శి(1983–85)గా, డిప్యూటీ లీడర్ ఆఫ్ అపోజిషన్(1985–89), సహకార/పరిశ్రమ శాఖల మంత్రి(1992–94)గా, కర్నాటక శాసనసభలో ప్రతిపక్షనాయకుడి(1996–99)గా, హోంశాఖామంత్రి (1999–2004)గా, నీటి వనరుల మంత్రి(2004–06)గా, కర్నాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యుడిగా సేవలు అందించారు. లోకసభలో యంపీ(2009–19)గా, కేంద్ర కార్మికశాఖ/ఉద్యోగ శాఖల మంత్రి(2009–13)గా, రైల్వే/ సామాజికన్యాయ శాఖల మంత్రి(2013–14)గా, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్‌గా(2016–19),లోకసభలో ప్రతిపక్ష నాయకుడిగా(2014–19), ఏఐసిసి జనరల్ సెక్రటరీగా(2018–2020), రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడిగా(2021–22), రాజ్యసభ సభ్యుడిగా సేవలందించి, 26 అక్టోబర్ 2022 నుంచి ప్రతిష్టాత్మక అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. శాసనసభ సభ్యుడిగా, పార్లమెంట్ మెంబర్‌గా, రాష్ట్ర మంత్రిగా, కేంద్రమంత్రిగా పలు పదవులను సమర్థవంతంగా నిర్వహించిన మల్లికార్జున ఖర్గే రాజకీయ ప్రస్థానంలో ముఖ్యమంత్రిగా సేవలు అందించే అదృష్టాన్ని పలు సార్లు కోల్పోయారు. కర్నాటక రాష్ట్ర ఆక్ట్రాయ్ నిషేధ కమిటీ చైర్మన్, లెదర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవులతో పాటు పలు కమిటీలకు అధ్యక్షుడిగా, సభ్యుడిగా సేవలందించారు.

నెహ్రూ–గాంధేతరులు కాంగ్రెస్ పార్టీ పగ్గాలను చేపట్టుట అరుదుగా జరుగుతుంది. కాంగ్రెస్ పార్టీ ఎదుర్కొంటున్న సంక్షోభ సమయాన భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మల్లికార్జునుడు ఏ మాయ చేస్తాడో చూడాల్సి ఉంది. గాంధీ కుటుంబం చేతిలో ఎల్లవేళల కీలు బొమ్మలా కాకుండా ప్రజా ప్రయోజన కార్యక్రమాలతో 'హస్త' రేఖలకు అదృష్టాన్ని అద్దడానికి కృషి చేయడంలో సాఫల్యత పొందాలని కార్యకర్తలు కోరుకుంటున్నారు. పార్టీ 'చేయి'కి జవసత్వాలు నింపి కాంగ్రెస్ పార్టీకి ఆక్సీజన్ నింపే లక్ష్యంలో ఖర్గే సఫలం కావాలని పార్టీ హితులు, సన్నిహితులు కోరుకుంటున్నారు. ఆల్ ది బెస్ట్ ఖర్గే.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# స్వచ్ఛతను జీవితంలో అంతర్భాగంగా వ్యవస్థీకరించేందుకు ప్రత్యేక ప్రచారం 2.0ను చేపట్టిన గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ

న్యూఢిల్లీ, నవంబర్ 5:సన్నాహక దశగా 14 నుంచి 30 సెప్టెంబర్ 2022 వరకు పెండింగ్ లో ఉన్న సమస్యలను గుర్తించడం ద్వారా భారత ప్రభుత్వం ప్రత్యేక ప్రచారం 2.0ను ప్రకటించింది. ఈ సందర్భంగా ప్రచార కాలానికి స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించడం జరిగింది. ఈ ఏడాది లక్ష్యాలు గృహ నిర్మాణ – పట్టణ వ్యవహారాల క్షేత్ర స్థాయి కార్యాలయాలపై దృష్టి పెట్టాయి. గుర్తింపు సమయంలో పెండెన్సీని నిర్మూలించడం, మెరుగైన రికార్డు నిర్వహణ కోసం పారిశుద్ధ్యాన్ని ప్రోత్సహించడం, సామర్థ్యాలను మెరుగుపరచడం, పారదర్శకతను పెంచడం వంటి కీలక అంశాలపై దృష్టి పెట్టారు.

ప్రచార అమలు దశ (2 అక్టోబర్ నుంచి 31 అక్టోబర్ 2022)లో 72 ఎంపి రిఫరెన్సుల్లో 53ను, 14 పార్లమెంటు హామీలలో నాలుగింటిని, 335 ప్రజా ఫిర్యాదులలో 214ను, 94 ప్రజా ఫిర్యాదు అప్పీళ్ళలో 87ను పరిష్కరించగా, 13526 భౌతిక ఫైళ్ళను ఇప్పటి వరకూ నిర్మూలించారు. మొత్తం 66 బయటి పారిశుద్ధ్య ప్రచారాలను నిర్వహించారు. వివిధ కార్యాలయాల్లోని వాడుకలో లేని వస్తువులను పారవేయడం ద్వారా మొత్తం రూ. 44860/– ఆదాయ సమకూరడమే కాక చెత్తను/ రికార్డులను నిర్మూలించిన అనంతరం 2236 చదరపు అడుగుల విస్తీర్ణం ఖాళీ అయింది. ప్రచార సమయంలో ప్రజా వినిమయ సీమ, సేవలను అందించడంలో బాధ్యత వహించే కార్యాలయాలకు ప్రాధాన్యతను ఇవ్వడం జరిగింది.

మంత్రిత్వ శాఖ సోషల్ మీడియా పై క్రమం తప్పకుండా తన కార్యకలాపాలను వెల్లడిస్తోంది. ప్రచార సమయంలో, మంత్రిత్వ శాఖ చేస్తున్న పనిని గుర్తించేందుకు 80 ట్వీట్ లు, 80 ఫేస్ బుక్ పోస్టులు, 80 ఇన్ స్టాగ్రామ్ సందేశాలు ప్రచురితం చేయగా, 5 యూట్యూబ్ వీడియోలను అప్ లోడ్ చేయడం జరిగింది.

గృహనిర్మాణం – పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో ప్రత్యేక ప్రచారం అమలులో సాధించిన పురోగతిని సమీక్షించేందుకు, మొత్తం పారిశుద్ధ్యాన్ని తనిఖీ చేసేందుకు న్యూఢిల్లీలోని మంత్రిత్వ శాఖ ఆవరణలో నిర్మాణ్ భవన్ లో సంయుక్త కార్యదర్శి ప్రతి రోజూ ఒకసారి చుట్టి వచ్చారు. ఆదేశాల అనంతరం సిపిడబ్ల్యుడి చిన్న చిన్న మరమత్తులను చేపట్టింది.

ప్రత్యేక ప్రచారంలో భాగంగా దేశవ్యాప్తంగా, వివిధ రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాలలో గల వివిధ కార్యాలయాలను స్వయం సహాయక బృందాలతో (ఎస్ హెచ్ జిలు) అనుసంధానం చేసుకోవడాన్ని మంత్రిత్వ శాఖ సులభతరం చేసింది. ఈ ఏర్పాటు కింద, తమ కియోస్క్ లను పెట్టుకునేందుకు ఎస్ హెచ్ జి లు రీసైక్లింగ్ కోసం వివిధ కార్యాలయ వ్యర్థాలను సేకరించేందుకు ఆయా కార్యాలయాలలో జాగాను ఇస్తున్నారు. స్వచ్ఛతా ప్రచారంలో భాగంగా, రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ (3ఆర్ లు – తగ్గించు, పునర్వినియోగం, పునరుపయోగం)ను ప్రోత్సహించేందుకు ఉద్దేశించింది. మొత్తం 187 కియోస్క్ లను ఏర్పాటు చేశారు.

# జాతీయ ఎస్సీ-ఎస్టీ హబ్ పథకం కింద నిర్వహించిన అత్యున్నత స్థాయి పర్యవేక్షణ సంఘం (హెచ్‌పీఎంసీ) 5వ సమావేశానికి అధ్యక్షత వహించిన శ్రీ నారాయణ్ రాణే

న్యూఢిల్లీ, నవంబర్ 5:జాతీయ ఎస్సీ–ఎస్టీ హబ్ పథకం కింద నిర్వహించిన అత్యున్నత స్థాయి పర్యవేక్షణ సంఘం (హెచ్‌పీఎంసీ) 5వ సమావేశం 2022 నవంబర్ 3న న్యూఢిల్లీలో జరిగింది. కేంద్ర ఎంఎస్ఎంఈ మంత్రి శ్రీ నారాయణ్ రాణే అధ్యక్షత వహించగా, సహాయ మంత్రి శ్రీ భాను ప్రతాప్ సింగ్ వర్మ సహ అధ్యక్షత వహించారు

శ్రీ నారాయణ్ రాణే మాట్లాడుతూ, సూక్ష్మ ఉచిన్న పరిశ్రమల కోసం రూపొందించిన కేంద్ర ప్రభుత్వ ప్రజా సేకరణల విధానంలో నిర్దేశించిన విధంగా ఎస్సీ/ఎస్టీ పారిశ్రామికవేత్తల నుంచి సీపీఎస్ఈల ద్వారా జరిగే 4% తప్పనిసరి కొనుగోళ్ల కోసం ఎస్సీ/ఎస్టీ పారిశ్రామిక వేత్తలకు ఒక సహాయక పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేయడమే జాతీయ ఎస్సీ–ఎస్టీ హబ్ లక్ష్యం. ఈ పథకం అమల్లోకి వచ్చాక ఎస్సీ–ఎస్టీ సంస్థల నుంచి కొనుగోళ్లు గణనీయంగా పెరిగాయని కేంద్ర మంత్రి వెల్లడించారు. సమావేశంలో సభ్యులు చేసిన విలువైన సూచనలన్నింటినీ తగిన విధంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

కేంద్ర సహాయ మంత్రి శ్రీ భాను ప్రతాప్ సింగ్ వర్మ ఎన్ఎస్ఎస్‌హెచ్ పురోగతిపై తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. సభ్యుల విలువైన సూచనలను తప్పకుండా పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు.

దళిత్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (డీఐసీసీఐ), ట్రైబల్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (టీసీసీఐ), అసోచామ్, బిజినెస్ అసోసియేషన్ నాగాలాండ్ (బీఏఎన్), కేంద్ర సామాజిక న్యాయం ఉ సాధికారత, కేంద్ర గిరిజన వ్యవహారాలు, నీతి ఆయోగ్ అధికారులతో కూడిన హెచ్‌పీఎంసీ సభ్యులు ఈ సమావేశానికి హాజరయ్యారు.



# పీపీపీ ప్రాజెక్టుల అభివృద్ధి వ్యయానికి ఆర్థిక సహకారం అందించేందుకు రూపొందిన 'ఐఐపిడిఎఫ్ పథకం'

న్యూఢిల్లీ, నవంబర్ 5: పీపీపీ ప్రాజెక్టుల అభివృద్ధి వ్యయానికి ఆర్థిక సహకారం అందించేందుకు రూపొందిన 'ఐఐపిడిఎఫ్ పథకం (ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ ఫండ్ స్కీమ్) 03.11.2022న ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన ఆర్థిక వ్యవహారాల విభాగం ప్రకటించింది.

ప్రైవేటు రంగానికి ప్రోత్సాహం అందిస్తూ దేశంలో నాణ్యమైన మౌలిక సదుపాయాలను వేగంగా అభివృద్ధి చేసే అంశానికి ఆర్థిక వ్యవహారాల విభాగం ప్రాధాన్యత ఇస్తున్నది. మౌలిక సౌకర్యాల కల్పన రంగంలో ప్రైవేటు రంగం ఎక్కువగా పాల్గొనేలా చూసేందుకు విధాన రూపకల్పన చేయడానికి ఆర్థిక వ్యవహారాల విభాగం కృషి చేస్తున్నది. మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం చేపట్టిన ప్రాజెక్టుల్లో ప్రైవేటు పెట్టుబడులు వచ్చేలా చూసేందుకు ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) ప్రోత్సహించాలని ఆర్థిక వ్యవహారాల విభాగం నిర్ణయించింది. పీపీపీ పద్ధతిలో ప్రాజెక్టుల నిర్మాణం వేగంగా నాణ్యతతో పూర్తి చేయడానికి అవకాశం కలుగుతుంది. అవసరమైన ప్రాంతాల్లో ప్రైవేటు రంగానికి ఆర్థిక, సాంకేతిక సహకారం అందించేందుకు కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయి.

పీపీపీ విధానాన్ని ప్రోత్సహించేందుకు అమలు చేస్తున్న కార్యక్రమాల్లో భాగంగా పీపీపీ ప్రాజెక్టుల అభివృద్ధికి అవసరమయ్యే నిధులు సమకూర్చడానికి 'ఐఐపిడిఎఫ్ పథకం (ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ ఫండ్ స్కీమ్)కి ఆర్థిక వ్యవహారాల విభాగం రూపకల్పన చేసింది.పీపీపీ ప్రాజెక్టులను గుర్తించేందుకు నియమించే సలహాదారులు,కన్సల్టెంట్‌లకు అయ్యే ఖర్చును భరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన పీఎస్ఏ లకు అవసరమైన ఆర్థిక సహకారం అందించాలని ఆర్థిక వ్యవహారాల విభాగం నిర్ణయించింది.

కేంద్ర ప్రాయోజిత పథకంగా ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ ఫండ్ స్కీమ్ ( ఐఐపిడిఎఫ్ ) అమలు జరుగుతుంది. నాణ్యమైన పిపిపి ప్రాజెక్ట్‌ల అభివృద్ధికి కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ప్రాజెక్ట్ స్పాన్సర్ చేసిన సంస్థలు ఐఐపిడిఎఫ్ ద్వారా అవసరమైన నిధులు పొందుతాయి. దేశానికి అవసరమైన ఆధునిక మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసేందుకు ఐఐపిడిఎఫ్ సహాయపడుతుంది. ఇప్పటికే పీపీపీ లకు 07.12.2020న ప్రకటించిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (వీజీఎఫ్ స్కీమ్)కింద ఆర్థిక సహకారం అందుతోంది. దీనితో పాటు ఐఐపిడిఎఫ్ కింద పీపీపీ లకు ఆర్థిక సహకారం అందుతుంది. ఆర్థికంగా వెసులుబాటుగా ఉన్నప్పటికీ వాణిజ్యపరంగా వెసులుబాటు కాని పీపీపీ లకు ఆర్థిక సహకారం అందించబడుతుంది. పథకం వివరాలు, మార్గదర్శకాలు లిలిలి.జూజూజూతితినిటతిజీ.ణనీల.తిని . లో అందుబాటులో ఉన్నాయి.

దేశంలో పీపీపీ అభివృద్ధికి దోహదపడే వ్యవస్థను అభివృద్ధి చేయడానికి ఆర్థిక వ్యవహారాల విభాగం కు చెందిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ సెక్రటేరియట్ అనేక కార్యక్రమాలను చేపట్టింది. పీపీపీ అమలులో ఉండే వ్యవధికి అనుగుణంగా కార్యక్రమాలు రూపొందాయి. పీపీపీ విజయం సాధించే అంశంలో సలహా/కన్సల్టెన్సీ సేవలు కీలకంగా ఉంటాయి సలహా/ కన్సల్టెన్సీ సేవలు గుర్తించి ఖరారు చేసే అంశం .పీపీపీ లను స్పాన్సరింగ్ అథారిటీలకు క్లిష్టంగా మారింది. దీనివల్ల ప్రాజెక్టులను అమలు చేయడంలో జాప్యం జరుగుతోంది.

దీనిని దృష్టిలో ఉంచుకుని ఆర్థిక వ్యవహారాల విభాగం విభాగం 01.07.2022న ప్రీ–క్వాలిఫైడ్ టివిల ప్యానెల్ నోటిఫై చేసింది. ఈ ప్యానెల్‌ని ఉపయోగించడం కోసం మార్గదర్శకాలను రూపొందించింది.

# పీజీ మెడికల్ రెండో విడత కన్వీనర్ కోటా సీట్లకు 5,6వ తేదిల్లో వెబ్‌ఆప్షన్లు

వరంగల్, నవంబర్5: పీజీ వైద్య కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి ఈనెల 5,6వ తేదిల్లో వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

ఈమేరకు హెల్త్ యూనివ ర్సిటీ రెండో విడత ప్రవేశాలకు నోటిపికేషన్ విడుదల చేసింది. కాళోజీ ఆరోగ్య విశ్వవి ద్యాలయం పరిధిలోని కళాశాలలకు, నిమ్స్ మెడికల్ కళాశాలలోని కన్వీనర్ కోటా సీట్లను ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనున్నట్లు తెలిపారు.

తుది మెరిట్ జాబితాలోని అర్హులైన అభ్యర్థులు వెబ్‌కౌన్సెలింగ్‌లో హాజరుకావాలని సూచించారు.

సీట్ల ఖాళీల వివరాలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపర్చారు.

ఈనెల 5న శనివారం ఉదయం 8 గంటల నుంచి 6న ఆదివారం మధ్యాహ్నం 1 గంట వరకు ప్రాధాన్యత క్రమంలో కళాశాలలవారీగా వెబ్‌ఆప్షన్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌లో చూడాలని యూనివర్సిటీ వర్గాలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# ఇండియా వాటర్ వీక్ 3వ రోజున జలవనరుల సుస్థిర అభివృద్ధికి హామీపై స్థిరమైన దృష్టి కేంద్రీకరణ

న్యూఢిల్లీ, నవంబర్ 5:ఉత్తరప్రదేశ్ లోని గ్రేటర్ నోయిడాలో ఇండియా ఎక్స్ పో సెంటర్ లో జరుగుతున్న ఇండియా వాటర్ వీక్ 2022 మూడో రోజున జల వనరుల సుస్థిర అభివృద్ధి కోసం చేపట్టవలసిన కార్యకలాపాలపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించారు. ఇందుకోసం అవకాశాలు, సవాళ్లపై మరింతగా చర్చించే వివిధ కార్యకలాపాలు చేపట్టాలని నిర్ణయించారు. "సమర్థవంతమైన జనవనరుల నిర్వహణకు అందుబాటులోని టెక్నలాజికల్ సొల్యూషన్లు" అనే అంశంపై టెక్నికల్ సెషన్ నిర్వహించారు. వాటర్ ఎడ్యుకేషన్, ప్రజా చైతన్యం– మీడియా పాత్ర; జల నిర్వహణ సొల్యూషన్ల వికేంద్రీకరణ, పౌర సమాజం అనే మూడు అంశాలపై ప్యానెల్ చర్చ నిర్వహించారు. వీటికి తోడు పాఠశాల విద్యార్థులు, యువ వృత్తి నిపుణులు, ఐడబ్ల్యుఆర్ఎస్ అనుబంధ కార్యక్రమాలు కూడా నిర్వహించారు.

సమర్థవంతమైన జలవనరుల నిర్వహణలో పౌర సమాజం పాత్రపై ఇండియా వాటర్ పార్టనర్ షిప్ (ఐడబ్ల్యుపి) ఆధ్వర్యంలో ఆలోచనాత్మకమైన, ఆసక్తికరమైన చర్చ జరిగింది. ఐసిఐడి సెక్రటరీ–జనరల్ శ్రీ ఎ.బి.పాండ్య సెషన్ కు అధ్యక్షత వహించారు. డబ్ల్యుడబ్ల్యుఎఫ్ ఇండియా రివర్ బేసిన్ అండ్ వాటర్ పాలసీ డైరెక్టర్ ఎస్.వి.సురేష్ బాబు; వాటర్ ఎయిడ్ ఇండియా సిఇఓ శ్రీ వి.కె.మాధవన్; ఎన్ఎంసిజి–టెరి సిఓఇ–వాటర్ రీయూజ్ సీనియర్ ఫెలో అండ్ హెడ్ డాక్టర్ నూపుర్ బహదూర్; ఆగా ఖాన్ ఫౌండేషన్ వాష్ అండ్ హెల్త్ విభాగం డైరెక్టర్ డాక్టర్ అసద్ ఉమర్; ధన్ ఫౌండేషన్ సుహామ్ డైరెక్టర్ సిఇఓ శ్రీ ఆర్.రాజపాండ్యన్; ఐఇఎల్ఓ ఫౌండింగ్ పార్టనర్, పర్యావరణ చట్టాల నిపుణుడు శ్రీ షవాహిక్ సిద్ధికి తమ అభిప్రాయాలు పంచుకున్నారు.

వాటర్ ఎడ్యుకేషన్, ప్రజా చైతన్యం, మీడియా పాత్ర, జలవనరుల నిర్వహణలో వికేంద్రీకరణ సొల్యూషన్లు వంటి విభిన్న అంశాలపై ప్యానెల్ చర్చలు నిర్వహించారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల కమాండ్ ఏరియాలో నివశిస్తున్న ప్రజల్లో విశ్వాసం ఏర్పరచేందుకు సాధారణ ప్రజలు, భాగస్వామ్య పక్షాలు, ప్రభుత్వ అధికారుల మధ్య సంభాషణలు నిర్వహించారు. జల వనరుల ప్రాజెక్టుల మౌలిక వసతులపై యాజమాన్యం నీటి వినియోగదారుల చేతిలోనే ఉంటుంది, వారే వాటి నిర్వహణకు బాధ్యులు. నీటి మౌలిక వసతులు లేని వర్గాలకు నీటిని అందించే విషయంలో కేంద్రీయ వ్యవస్థపై వికేంద్రీకృత ట్రీట్ మెంట్ వ్యవస్థ ప్రయోజనాలపై కూడా చర్చ జరిగింది.

జలవనరుల సమర్థవంతమైన నిర్వహణకు టెక్నాలజీ సొల్యూషన్లు, పౌర సమాజం పాత్రపై సెమినార్లు నిర్వహించారు. ఫ్రాగ్మెంటేషన్, సమగ్ర దృక్పథం లేదా ఇంటిగ్రేషన్ లోపం; టెక్నాలజీ ప్రామాణీకరణ వంటి సమస్యల నిర్వహణలో డిజిటైజేషన్ సవాళ్ల కారణంగా నీటికి సంబంధించిన వ్యవహారాలు పరిణత స్థితికి చేరకపోవడం పట్ల ఆందోళన ప్రకటించారు. నీటి కొరత ఆహార భద్రతకు, ఇంధన సరఫరాలకు అంతరాయంగా మారి ఆర్థిక వృద్ధిని కూడా కుంటుపరుస్తుందన్న అంశం ప్రస్తావించారు. డిజిటల్ అజెండాను బలవంతంగా రుద్దడం కన్నా దాని వినియోగాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో కార్యాచరణతో కూడిన డిజిటల్ వ్యూహం, దానికి కట్టుబడడం; వాణిజ్యపరమైన అంశాలు; ప్రయోజనాలు అందరికీ అందించడం; మద్దతు వ్యవస్థలు సాధించే ఫలితాలకు డిజిటల్ టెక్నాలజీలో పెట్టుబడులు అనుసంధానం చేయడం వంటి అంశాలను కూడా చర్చించారు. అలాగే భూగర్భ జలాల మోడలింగ్, నీటి వినియోగంలో సమర్థనీయత, పంపింగ్ సామర్థ్యాలు, స్కాడా లీకేజిలు గుర్తించడం వంటి అంశాలపై కూడా చర్చ జరిగింది. వివిధ జల వనరుల నిర్వహణ విధానాలపై తమ పరిశోధనాంశాలను యువ వృత్తినిపుణులు, ప్రముఖ విద్యా సంస్థలకు చెందిన రీసెర్చ్ స్కాలర్లు పంచుకున్నారు. 250 మంది విద్యార్థులు, 30 మంది ఉపాధ్యాయులు ఉత్సాహంగా ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన చిత్ర లేఖన పోటీలో 90 మంది బాలలు పాల్గొన్నారు. 150 మంది పాఠశాల విద్యార్థులతో జలవనరుల నిర్వహణపై నుక్కడ్ నాటకం ప్రదర్శించారు. నీటి సంబంధిత అంశాలపై పాఠశాల విద్యార్థులతో ఒక గోష్ఠి నిర్వహించారు. కేంద్ర జలవనరుల శాఖ మంత్రి శ్రీ బిశ్వేశ్వర్ తుడు ఈ కార్యక్రమంలో పాల్గొని బాలలకు బహుమతులు అందచేశారు. ఎన్ డబ్ల్యుడిఏ డైరెక్టర్ జనరల్, ఐఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ సుధీర్ కుమార్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆసక్తి గల ప్రతినిధుల కోసం ఆగ్రాకు స్టడీ టూర్ నిర్వహించారు. మధ్యాహ్నం సెషన్ లో ఎగ్జిబిటర్లు తమ సంస్థల గురించి, ఉత్పత్తుల గురించి తెలియచేసే ప్రదర్శన నిర్వహించారు.

# నేషనల్ స్కాలర్ షిప్‌లో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ పథకం

న్యూఢిల్లీ, నవంబర్ 4: 2022– 2023 సంవత్సరానికిగాను ఎన్ఎంఎంఎస్ఎస్ కు దరఖాస్తులు చేసుకో వడానికి ఆఖరు తేదీ 15 నవంబర్ 2022. నేషనల్ మీన్స్–కమ్–మెరిట్ స్కాలర్ షిప్ స్కీమ్ కింద ఆర్థికంగా వెనుకబడిన వర్గాల ప్రతిభావంతులైన విద్యార్థులు 8వ తరగతిలో డ్రాప్ అవడాన్ని నిరోధించడానికి స్కాలర్షిప్ లు అందచేయడమే కాక ద్వితీయ శ్రేణి విద్యను కొనసాగించడాన్ని ప్రోత్సహిం చడం పథకం లక్ష్యం. పాఠశాలల్లో చదువుతున్న ఎచీ తరగతి విద్యార్థులకు ప్రతి ఏడాదీలక్ష తాజా స్కాలర్ షిప్ లను అందించేందుకు, రాష్ట్ర ప్రభుత్వ, ప్రభుత్వ సహాయంతో నడుస్తున్న, స్థానిక సంస్థల బడులలో 10 నుంచి 12 తరగతులలో వారి చదువును కొనసాగించేందుకు/పునరుద్ధరణ కోసం ఏడాదికి రూ. 12000/– మొత్తాన్ని స్కాలర్ షిప్ గా అందించారు.

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ స్కీం (ఎన్ఎంఎంఎస్ఎస్)ను విద్యార్థులకు అందించే స్కాలర్ షిప్ పథకాల కోసం ఉద్దేశించిన సమగ్ర వేదిక అయిన నేషనల్ స్కాలర్ షిప్ పోర్టల్ (ఎన్ ఎస్ పి)లో చేర్చింది. ఎన్ఎంఎంఎస్ఎస్ స్కాలర్ షిప్లను ఎంపిక చేసిన విద్యార్థులకు డిబిటి మోడ్ ను అనుసరించి ప్రజా ఆర్థిక నిర్వహణ వ్యవస్థ (పిఎఫ్ఎంఎస్) ద్వారా వారి బ్యాంకు అకౌంట్లలోకి ఎలక్ట్రానిక్ బదలాయింపు ద్వారా చెల్లిస్తారు. ఇది 100% కేంద్ర ప్రాయోజిత పథకం.

ఆహ్వానం
విశాలాంధ్ర 21వ వి-శాఖ పుస్తక మహోత్సవం
తేది 13-11-2022 నుండి 05-12-2022 వరకు
విశాఖపట్నం మెయిన్ రోడ్, "టర్నర్ చౌల్ట్రీ ఆవరణలో"
ప్రారంభోత్సవ సభ :
తేది 13-11-2022 ఆదివారం ఉదయం గం. 10-30 ని.లకు
అధ్యక్షులు : శ్రీ జె.వి. సత్యనారాయణమూర్తి
సి.పి.ఐ. రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్
ప్రారంభోత్సవం : శ్రీ గుడివాడ అమరనాథ్
భారీ పరిశ్రమలు & ఐ.టి. శాఖామంత్రివర్యులు
ముఖ్య అతిథి : శ్రీ ఎ. రాజబాబు, ఐ.ఎ.ఎస్.
కమీషనర్, జి.వి.యం.సి. విశాఖపట్నం
అతిథులు : డా॥ పి. మైధిలి
సూపరింటెండెంట్, కె.జి.హెచ్., విశాఖపట్నం
శ్రీ సుమిత్ భట్టాచార్జీ
ప్రిన్సిపాల్, కరస్పాండెంట్, చీఫ్ సబ్ ఎడిటర్, ది హిందూ
శ్రీ టి. మనోహర్‌నాయుడు
మేనేజర్, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
పి.ఎ. రాజు, మేనేజర్
విశాలాంధ్ర బుక్ హౌస్
విశాఖపట్నం, సెల్ : 9849257925
పుస్తక ప్రియులందరికీ ఇదే మా ఆహ్వానం

# వ్యవసాయ అభివృద్ధి కోసం అనుసరిస్తున్న విధానాలు దేశానికి ఆదర్శం... మంత్రులు ఎర్రబెల్లి, రాథోడ్.



మహబూబాబాద్, నవంబర్ 5:(నేటినిజం ప్రతినిధి): మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం, బంగారు చెలిమి తండా గ్రామంలో గ్రామీణ అభివృద్ధి సంస్థ - సెర్ప్(ఐ కె సి) ఆధ్వర్యంలో నిర్వహించిన భాగ్యలక్ష్మి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర గిరిజన, స్త్రీ- శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి సత్యవతి రాథోడ్ , పంచాయతీరాజ్ , గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రారంభించారు.

అనంతరం పెద్దవంగర మండల కేంద్రంలో ప్రాథమిక రైతు సేవా సహకార సంస్థ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పంచాయతీరాజ్ , గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి సత్యవతి రాథోడ్, మంత్రి దయాకర్ రావు మాట్లాడుతూ కేంద్ర బిజెపి రైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ రైతులకు నష్టం చేస్తుంది.

కొంతమంది సన్నాసి బిజెపి నాయకులు మాట్లాడుతున్నారు,

డబుల్ ఇంజిన్ అంటూ గప్పాలు కొట్టుకొనే బీజేపీ, దేశానికి అన్నం పెట్టే రైతన్నను నిలువునా మోసం చేస్తున్నది.

బీజేపీ పాలిత హర్యానా, కర్ణాటకలో రైతుల పరిస్థితి ప్రస్తుతం దయనీయంగా మారింది.

కార్పొరేట్ కంపెనీలకు వ్యవసాయం అప్పజెప్పేందుకు బిజెపి ప్రయత్నం చేస్తోందని అన్నారు.

తెలంగాణ ముఖ్యమంత్రి, రైతు బిడ్డ కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో పంటలు భారీ ఎత్తున సాగవుతున్నాయన్నారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు అండగా ఉన్నంతవరకు రైతులకు ఎలాంటి నష్టం జరగదు.

రైతుల కష్టాలు బీజేపీ కి పట్టవు.

మీకు, మీ పార్టీకి రైతుల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న బీజేపీ పాలిస్తున్న రాష్ట్రాల్లో రైతుబంధు, రైతుబీమా, నిరంతర విద్యుత్ ఇవ్వండి అని డిమాండ్ చేశారు

రైతులు పండించిన వడ్లను కొనాలని ఢిల్లీ దాకా వెళ్లి మొత్తుకున్నా కొనడానికి చేతకాని వారు.. వందల కోట్ల రూపాయలు సంచుల్లో పట్టుకొని ఎమ్మెల్యేలను కొనేందుకు వస్తున్నారు.

ఇంతకన్నా సిగ్గుమాలిన పని ఇంకొకటి ఉంటుందా?

కెసిఆర్ నాయకత్వంలో బిఆర్ఎస్ ముందుకు వస్తుంది.

గుజరాత్, కర్ణాటక రాష్ట్ర ప్రజలు కేసీఆర్ గారి నాయకత్వాన్ని కోరుకుంటున్నారు.

ప్రజా కోర్టు ముందు బీజేపీ నాయకులు దోషులుగా నిలబడబోతున్నారు.

రైతులు పండించిన వరి ధాన్యాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తుంది.

వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు దేశానికి ఆదర్శం.

ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

ఏ గ్రేడ్ వరి ధాన్యానికి 2060,బీ గ్రేడ్ 2040 రూపాయల, చొప్పున మద్దతు ధర ఇస్తుంది రాష్ట్ర ప్రభుత్వం.

దేశంలో ఒక్క కేసీఆర్ సర్కార్ మాత్రమే రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నది.

వ్యవసాయానికి 24 గంటల నిరంతర ఉచిత విద్యుత్తు, రైతుబంధు, రైతుబీమా పథకాలు అమలవుతున్న రాష్ట్రం దేశంలో ఒక్క తెలంగాణ మాత్రమేనని స్పష్టంచేశారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ డేవిడ్, డిఆర్డిఏ సన్యాసయ్య,ఎంపీపీ రాజేశ్వరి, జెడ్పిటిసి జ్యోతిర్మయి, ఎఫ్ ఎ సి ఎస్ చైర్మన్ కాకిరాల హరి ప్రసాద్ ,పాలకుర్తి దేవస్థానం చైర్మన్ వెనుకదాసుల రామచంద్రయ్య శర్మ, పెద్దవంగర సర్పంచ్ వెనకదాసుల లక్ష్మి ,బీసీ తండా సర్పంచ్ ధరావత్ పద్మ దేవేందర్,ఎంపీటీసీ సౌజన్య, ఆర్డీవో రమేష్, ఎమ్మార్వో రమేష్ బాబు,ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి, నాయకులు ఈదురు ఐలయ్య ,శ్రీరాం సంజయ్ ,శ్రీరామ్ సుధీర్ ,అన్నపురం రవి ,సర్పంచ్,లు ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇథనాల్ ప్లాంట్‌తో రైతులకు ఆర్థిక లబ్ధి.. 270 కోట్లతో ప్రాజెక్టు, సీఎం జగన్ శంకుస్థాపన

అమరావతి: నవంబర్ 5:వర్షాలు, వాతావరణ పరిస్థితుల కారణంగా బియ్యం విరిగిపోయినా, చెడిపోయినా ఆ దిగుబడులకు సరైన ధర అందించాలనే గొప్ప లక్ష్యంతో ఏపీలో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నామని సీఎం జగన్ అన్నారు. ఇథనాల్ ప్లాంట్ రైతులకు మరింత లబ్ధి చేకూరనుందని ప్రకటించారు. పంట పండించిన ఏ ఒక్క రైతు నష్టపోకుండా చూడటమే ప్రభుత్వ అంతిమ ధ్యేయమన్నారు. తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం గుమ్మళ్ళదొడ్డి వద్ద రూ.270 కోట్లతో టెక్ మహీంద్ర గ్రూప్ కు చెందిన అసాగో ఇండస్ట్రీస్ ఏర్పాటు చేస్తున్న బయో ఇథనాల్ యూనిట్ నిర్మాణ పనులకు ఇవ్వాల (శుక్రవారం) సీఎం జగన్ శంకుస్థాపన చేశారు.

భూమి పూజ తర్వాత టెక్ మహీంద్ర సీఈఓ సీపీ గుర్నానీతో కలిసి బహిరంగ సభలో సీఎం జగన్ మాట్లాడారు. 'దేవుడి దయతో ఈ రోజు రైతులు, పర్యావరణ సమతుల్యత సాధించే ఓ మంచి క్యాక్రమానికి శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. రూ.270 కోట్లతో టెక్ మహీంద్రా గ్రూప్ ఇథనాల్‌ను ప్లాంట్ తో రైతులు, నిరుద్యోగులకు లబ్ధి చేకూరుతుందన్నారు. 2 లక్షల లీటర్ల సామర్థ్యంతో ఏర్పాలయ్యే ఈ ప్లాంట్ లో బ్రోకెన్ రైస్ (విరిగిపోయిన బియ్యం) తో ఇథనాల్ తయారీ చేస్తారని తెలిపారు. పాడైపోయిన ఆహారధాన్యాలు, నూకలు, వ్యవసాయ ఉత్పత్తుల అవశేషాలు వినియోగించి ఇథనాల్‌ను తయారు చేయడంతో రైతులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుందని సీఎం పేర్కొన్నారు.

ఇథనాల్ తో పాటు పశువుల దాణా, చేపల మేతకు ఉపయోగపడే ప్రోటీన్ ఫీడ్ ను బై ప్రోడక్ట్స్ కింద ఉత్పత్తి చేస్తారని పేర్కొన్నారు. దీంతో వర్షాల కారణంగా రంగు మారిన ధాన్యానికి కూడా మంచి ధర లభిస్తుందని సీఎం జగన్ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు విజ్ఞప్తి మేరకు ఏలూరు కుడి కాలువ నిర్మాణం కోసం రూ.50 కోట్లు ఖర్చువుతుందని కోరడంతో సీఎం జగన్ వెంటనే నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఏలూరు కుడి కాలువ పనులతో 15 వేల ఎకరాల ఆయుకట్టుకు నీళ్లంది రైతులకు మంచి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మంత్రులు గుడివాడ అమర్ నాథ్,తానేటి వనిత, దాడిశెట్టి రాజా, వేణుగోపాలకృష్ణ, ఎంపీలు భరత్ రామ్, అనురాధ, వంగా గీతా, ఎమ్మెల్యేలు జ్యోతుల చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.



# జిల్లాలో 247 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు..!

### -జిల్లావ్యాప్తంగా అన్ని కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి.
### -మంత్రి హరీష్ రావు.

సంగారెడ్డి, నవంబర్ 05(నేటి నిజం ప్రతినిధి) జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా సజావుగా జరిగేలా ప్రజా ప్రతినిధులు అధికారులు చొరవ చూపాలని చూడాలని రాష్ట్ర ఆర్థిక వైద్య ఆరోగ్యశాఖల మంత్రి హరీష్ రావు అన్నారు.

శుక్రవారం సాయంత్రం మంత్రి ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులతో వానాకాలం దాన్యం కొనుగోళ్ల పై టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో వరి పంట సాగు బాగా పెరిగిందని, సుమారు లక్షా 70 వేల ఎకరాల్లో వరి సాగు అయిందని ,3.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉన్నట్లు అంచనా ఉందని, సుమారు 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందన్నారు.

అందుకు అనుగుణంగా జిల్లాలో 247 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఏ ఊరు కావూరులో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు ఎత్తైన ప్రదేశంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

జిల్లాలో ధాన్యం కోనుగోళ్లు వేగవంతంగా జరిగేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడ కూడా రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అందరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాల పర్యవేక్షణకు ఒక్కో నియోజకవర్గానికి ఒక సీనియర్ అధికారిని నియమించాలని జిల్లా కలెక్టర్ కు సూచించారు.

ఎమ్మెల్యేలు ,ప్యాక్స్ చైర్మన్లు, ఇతర ప్రజా ప్రతినిధులు ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలని, రైతులు నిర్ణీత తేమశాతంమేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తెచ్చేలా చూడాలన్నారు.

కొనుగోలు కేంద్రాలలో గన్ని బ్యాగులు ,తేమయంత్రాలు, టార్పాలిన్ కవర్లు, ప్యాడి క్లీనర్స్, అవసరమైనన్ని అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు.గ్రేడ్ ఏ ధాన్యంకు రూ.2060/-మద్దతు ధర ఉందన్నారు.

కోనుగోలు కేంద్రాల నుండి మిల్లులకు తరలించిన ధాన్యం మిల్లర్లు వెంట వెంటనే దింపుకోవాలని, కేంద్రాలలో, మిల్లుల్లో అవసరం మేర కూలీలను ఏర్పాటు చేసుకొని లోడింగ్, అన్ లోడింగ్ వెంటనే జరిగేలా చూడాలని,ట్రాక్ షీట్, ట్యాబ్ ఎంట్రి వెంటనే చేయాలన్నారు.



జిల్లా బార్డర్ ల వద్ద గట్టి బందోబస్తు తో చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేయాలన్నారు. ఇతర రాష్ట్రాల నుండి జిల్లాలోకి ధాన్యం రాకుండా నిఘా ఏర్పాటు చేయాలన్నారు.

అదేవిధంగా ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలు అన్నింటిపై అధికారులు ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

అదనపు కలెక్టర్, రెవిన్యూ డివిజనల్ అధికారులు, డి ఆర్ డి ఓ డి సి ఓ పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీలు బీబీ పాటిల్, కొత్త ప్రభాకర్ రెడ్డి, జడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ జయపాల్ రెడ్డి, శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ధరణి దరఖాస్తులను ఎలాంటి పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలి.

### -మండల తహసిల్దార్లకు ఆదేశించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్.

సంగారెడ్డి, నవంబర్ 05 (నేటి నిజం ప్రతినిధి) శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధరణి దరఖాస్తుల పరిష్కారం, పెండింగ్స్ తదితర అంశాలపై మండలం వారీగా ఆయా తహసిల్దార్లతో సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పలు మండలాల్లో ధరణి దరఖాస్తులు ఎక్కువ సంఖ్యలో పెండింగ్లో ఉన్నాయని, వాటిని పరిష్కరించడంలో తహసీల్దారులు సీరియస్ గా పని చేయాలన్నారు.

సరి అయిన కారణాలు లేకుండా తిరస్కరించరాదన్నారు. దరఖాస్తుదారులు కార్యాలయాల చుట్టూ తిరిగి వేసారి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దరఖాస్తులు తిరస్కరిస్తే దానికి సంబంధించిన స్పెసిఫిక్ కారణం చూపాలని, ఆమోదించినదానికి క్లియర్ గా రిమార్క్స్ ఉండాలన్నారు.

పాస్ బుక్ డేటా కరక్షన్, సక్సేషన్, మ్యూటేషన్, మిస్సింగ్ నంబర్స్,కన్వెన్షన్ ఇంటిమేషన్, జి ఎల్. ఎం, జి పి ఎల్ ఏ, ప్రొహిబిషన్ ప్రాపర్టీస్, కోర్టు



కేసెస్, నాలా పిపిబి కేసులు, నాలా విత్ అవుట్ పి పి బి, తదితరాలను క్షుణ్ణంగా పరిశీలించి అన్నింటిని క్లియర్ చేయాలని సూచించారు. నిర్లక్ష్యం వహించరాదని పెండింగ్లో ఉన్నట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ధరణి లో వచ్చిన అన్ని దరఖాస్తులను ప్రాపర్ గా డిస్పోజల్ చేయాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వరాదని తెలిపారు. ఆయా తహసిల్దార్లు ప్రత్యేక దృష్టితో పూర్తి బాధ్యతగా ఈనెలాఖరులోగా తమ మండలంలో గల ధరణి దరఖాస్తులన్నింటిని పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఆయా విషయాలలో రెవిన్యూ యాక్ట్ మేరకు పూర్తి అవగాహనతో పనిచేయాలని సూచించారు.

ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డిఆర్ఓ రాధికారమని, రెవిన్యూ డివిజనల్ అధికారులు నగేష్ ,రమేష్ బాబు, అన్ని మండలాల తహసిల్దార్లు, సూపరిండెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

# 2020-21తో పోలిస్తే 2021-22లో ప్రాథమిక, అప్పర్ ప్రైమరీ, హయ్యర్ సెకండరీ స్థాయి పాఠశాల విద్యలో మెరుగుపడిన జీఈఆర్

న్యూఢిల్లీ, నవంబర్ 5:భారత దేశ పాఠశాల విద్య కు సంబంధించి యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్ (యుడిఐఎస్ఇ+) 2021-22 పై విద్యా మంత్రిత్వ శాఖ సమగ్ర నివేదికను విడుదల చేసింది.

పేపర్ ఫార్మాట్ లో మాన్యువల్ డేటా ఫిల్లింగ్ మునుపటి అభ్యాసానికి సంబంధించిన సమస్యలను అధిగమించడానికి, ముఖ్యంగా డేటా క్యాప్చర్, డేటా మ్యాపింగ్ , డేటా వెరిఫికేషన్ కు సంబంధించిన రంగాల్లో మెరుగుదల కు పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం 2018-19 సంవత్సరంలో పాఠశాలల నుండి ఆన్ లైన్ డేటా సేకరణ కు యుడిఐఎస్ ఇ+ సిస్టమ్ ను అభివృద్ధి చేసింది.

యుడిఐఎస్ఇ + 2021-22 లో, డిజిటల్ లైబ్రరీ, పీర్ లెర్నింగ్, హార్డ్ స్పాట్ ఐడెంటిఫికేషన్, స్కూల్ లైబ్రరీలో అందుబాటులో ఉన్న పుస్తకాల సంఖ్య మొదలైన ముఖ్యమైన సూచికలపై అదనపు డేటాను ఎన్ఈపి 2020 చొరవలతో అలైన్ చేయడానికి మొదటిసారి సేకరించారు.

స్కూలు ఎడ్యుకేషన్ లో విద్యార్థులు- ఉపాధ్యాయులు

2020-21లో 25.38 కోట్ల మంది విద్యార్థుల నమోదుతో పోలిస్తే 2021-22లో ప్రైమరీ నుంచి హయ్యర్ సెకండరీ వరకు పాఠశాల విద్యలో చేరిన మొత్తం విద్యార్థులు 25.57 కోట్ల మంది ఉన్నారు. ఇది 19.36 లక్షలు ఎక్కువ. 2020-21లో 4.78 కోట్లుగా ఉన్న షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల నమోదు 2021-22 నాటికి 4.82 కోట్లకు పెరిగింది. అదేవిధంగా, మొత్తం షెడ్యూల్డ్ తెగల విద్యార్థుల నమోదు 2020-21 లో 2.49 కోట్ల నుండి 2021-22 లో 2.51 కోట్లకు పెరిగింది. 2020-21లో 11.35 కోట్లుగా ఉన్న ఇతర వెనుకబడిన విద్యార్థులు 2021-22లో 11.48 కోట్లకు పెరిగారు.

2020-21తో పోలిస్తే 2021-22లో ప్రాథమిక, అప్పర్ ప్రైమరీ, హయ్యర్ సెకండరీ స్థాయిల్లో స్థూల నమోదు నిష్పత్తి (జీఈఆర్) మెరుగుపడింది. ముఖ్యంగా, హయ్యర్ సెకండరీలో జిఇఆర్ 2021-21 లో 53.8% నుండి 2021-22 లో 57.6% కు గణనీయమైన ఎ ె ం ం ు గ ు ం ద ు ల న ు సాధించింది. 2020-21లో ప్రత్యేక అవసరాలతో ఉన్న పిల్లల (సి డబ్ల్యు ఎస్ ఎన్) నమోదు 21.91 లక్షల మందితో పోలిస్తే 2021-22లో 22.67 లక్షలకు పెరిగి 2020-21లో 3.45 శాతం వృద్ధి నమోదైంది.

2021-22లో 95.07 లక్షల మంది ఉపాధ్యాయులు పాఠశాల విద్యలో నియమితులయ్యారు. వీరిలో 51% పైగా మహిళా ఉపాధ్యాయులు ఉన్నారు. ఇంకా, 2021-22 లో, విద్యార్థి -ఉపాధ్యాయ నిష్పత్తి (పిటిఆర్) ప్రాథమికానికి 26, అప్పర్ ప్రైమరీకి 19, సెకండరీకి 18, హయ్యర్ సెకండరీకి 27 గా ఉంది, ఇది 2018-19 నుండి మెరుగుదలను చూపించింది. 2018-19లో ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, సెకండరీ , హయ్యర్ సెకండరీ స్థాయి లో పిటిఆర్ వరుసగా 28, 19, 21, 30 గా ఉంది. 2021-22లో 12.29 కోట్ల మంది బాలికలు ప్రైమరీ నుంచి హయ్యర్ సెకండరీ వరకు చేరారు. ఈ సంఖ్య 2020-21 తో పోలిస్తే 8.19 లక్షలు ఎక్కువ. జిఈఆర్ లింగ వ్యత్యాస సూచీ (జిపిఐ) పాఠశాల విద్యలో మహిళల ప్రాతినిధ్యం సంబంధిత వయస్సు గ్రూపు జనాభాలో బాలికల ప్రాతినిధ్యానికి అనుగుణంగా ఉందని చూపిస్తుంది. పాఠశాల విద్య అన్ని స్థాయిల వద్ద జి పీ ఐ విలువ ఒకటి లేదా అంతకంటే ఎక్కువ పాఠశాల విద్యలో బాలికలు ఎక్కువగా ఉండడాన్ని సూచిస్తుంది.

2020-21లో 4.78 కోట్ల నుంచి 2021-22లో ప్రైమరీ నుంచి హయ్యర్ సెకండరీ వరకు మొత్తం షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) విద్యార్థుల సంఖ్య 4.83 కోట్లకు పెరిగింది. అదేవిధంగా, మొత్తం షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) విద్యార్థులు 2.49 కోట్ల నుండి 2.51 కోట్లకు, ఇతర వెనుకబడిన కులాల (ఒబిసి) విద్యార్థులు 11.35 కోట్ల నుండి 2021-22 లో 11.49 కోట్లకు పెరిగారు.

# భారత్‌పై ప్రశంసలు కురిపించిన.. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్

న్యూఢిల్లీ, నవంబర్ 5:అంతర్జాతీయస్థాయిలో భారత్ ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లే నైపుణ్యం భారతీయులకు ఉందని కొనియాడారు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ . రష్యా ఐక్యతా దినోత్సవం సందర్భంగా మాస్కోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అభివృద్ధిలో భారత్ కచ్చితంగా అద్భుతమైన ఫలితాలను సాధిస్తుంది. ఇందులో ఎలాంటి సందేహం లేదు. 150 కోట్ల మంది ప్రజలతో భారత్ సమర్థవంతంగా ఉందని ప్రశంసలు కురిపించారు.

గత వారం కూడా ప్రధాని మోడీపై పుతిన్ ప్రశంసల జల్లు కురిపించారు. మోడీ గొప్ప దేశ భక్తుడని కితాబిచ్చారు. మోదీ స్వతంత్ర విదేశాంగ విధానంతో భారత్ ఎంతో సాధించిందని చెప్పారు.

భవిష్యత్తు భారత్ దే అని వ్యాఖ్యానించారు. వచ్చే వారం భారత విదేశాంగ మంత్రి జైశంకర్ రష్యాలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో పుతిన్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

# మద్రాస్ హైకోర్టు ఫుల్ కండిషన్స్.. బహిరంగ ర్యాలీలను ఆపేస్తున్నట్టు ప్రకటించిన ఆర్ఎస్ఎస్

న్యూఢిల్లీ, నవంబర్ 5:తమిళనాడులో నవంబర్ 6వ తేదీన జరగాల్సిన తమ ర్యాలీలను చేపట్టబోమని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఇవ్వాల (శనివారం) ప్రకటించింది. మద్రాస్ హైకోర్టు అనుమతి ఇచ్చినట్టే ఇచ్చి.. కొన్ని కండిషన్స్ పెట్టడమే దీనికి కారణంగా చెబుతున్నారు కొంతమంది ప్రతినిధులు. ఆర్ఎస్ఎస్ సీనియర్ లీడర్లు కొంతమంది వీడియో కాన్ఫరెన్సింగ్ భేటీలో ఈ నిర్ణయం తీసుకున్నారు. మద్రాస్ హైకోర్టు తమకు ఆమోదయోగ్యం కాని కొన్ని కండిషన్స్ విధించినందున నవంబర్ 6న రాష్ట్రంలో రూట్ మార్చ్ లను నిర్వహించబోమని ఆర్ఎస్ఎస్ వెల్లడించింది.

ఇండోర్ స్టేడియంలలో లేదా నాలుగు గోడల మధ్య మార్చ్ నిర్వహించాలని కోర్టు నిన్న (నవంబర్ 4) ఇచ్చిన తీర్పులో పేర్కొంది అని ఆర్ఎస్ఎస్ సౌత్ జోన్ అధ్యక్షుడు ఆర్ వన్నిరాజన్ విలేకరుల సమావేశంలో అన్నారు. మొత్తం 60 లేదా44 ప్రదేశాల్లో ఆర్ఎస్ఎస్ ర్యాలీలు నిర్వహించేందుకు మద్రాస్ హైకోర్టు అనుమతినిచ్చిందని, మూసి ఉన్న స్టేడియం లేదా మైదానంలో మాత్రమే ర్యాలీలు నిర్వహించాలను కోర్టు పేర్కొందని ఆయన తెలిపారు.

కాగా, ఈ సింగిల్ జడ్జి ఉత్తర్వులపై అప్పీల్‌కు వెళ్లనున్నట్టు ఆర్ఎస్ఎస్ తరపు న్యాయవాది రాబు మనోహర్ చెప్పారు. దీనిపై మాట్లాడిన వన్నిరాజన్ మాత్రం.. నిన్న హైకోర్టు తీర్పు వెలువరించింది. మొదట్లో 44 చోట్ల పర్మిషన్ ఇచ్చారని, 6 చోట్ల వాయిదా వేశారని.. ఆ ఉత్తర్వు మొత్తం 44 చోట్ల పర్మిషన్ ఇచ్చారని చెప్పారు. మూసి ఉన్న స్టేడియాలు, ఇండోర్? స్టేడియాల్లో ర్యాలీ మార్చ్ చేపట్టాలనడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

98 ఏళ్లుగా బహిరంగ ప్రదేశాల్లో రూట్ మార్చ్ లు నిర్వహిస్తున్నామని, బహిరంగ ప్రదేశాలకు వెళ్లినప్పుడు మాత్రమే ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని, జమ్మూ కాశ్మీర్, పశ్చిమ బెంగాల్, కేరళ వంటి రాష్ట్రాల్లో కూడా రూట్ మార్చ్ లకు అనుమతి ఉందని అడ్వొకేట్ మనోహర్ చెప్పారు.

ఆర్ఎస్ఎస్ రూట్‌మార్చ్ ను నిర్వహించరాదని మద్రాస్ హైకోర్టు తీర్పునిచ్చింది.

ఈ ప్రదేశాలు కోయంబత్తూర్, మెట్టుపాళయం, పొల్లాచ్చి; తిరుప్పూర్ జిల్లాలోని పల్లడం, కన్నియాకుమారిలోని అరుమనై, నాగర్‌కోయిల్ వంటి ఆరు చోట్ల కవాతులను పరిమితం చేయడంతో పాటు, కార్యక్రమంలో ఎవరూ పాటలు పాడకూడదని, ఏ వ్యక్తి, కులం, మతం గురించి చెడుగా మాట్లాడకూడదని కోర్టు పేర్కొంది. పాల్గొనేవారు ఎటువంటి కర్ర, లాఠీ, ఆయుధాలను తీసుకురావద్దని కోరింది.

# మునుగోడు ఎన్నికలో 50వేల ఓట్ల మెజార్టీతో గెలవబోతున్నా..కేఏపాల్



హైదరాబాద్, నవంబర్ 5:పోలీసులు తమని ఇబ్బందులకు గురి చేశారని ..ప్రజాశాంతి పార్టీ అధినేత కేఏపాల్ తెలిపారు. మునుగోడు ఉప ఎన్నికలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని ఆయన మండిపడ్డారు. రెండు ప్రధాన పార్టీలు ఓటర్లను ప్రలోభాలకు గురి చేశాయని? అయినప్పటికీ ఆ పార్టీలకు గెలిచే పరిస్థితి లేదని చెప్పారు. జిల్లా ఎస్పీ కూడా టీఆర్ఎస్ కు ఏజెంట్ మాదిరి వ్యవహరించారని ఆరోపించారు. తనకు కనీసం గన్ మెన్లను కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. గద్దర్ కు గన్ మెన్లను ఇచ్చారని, తనకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. మునుగోడులో గెలుపు తనదే అని కేఏ పాల్ చెప్పారు. 50 వేల ఓట్ల మెజార్టీతో తాను గెలవబోతున్నానని అన్నారు. మునుగోడు మహిళలు, యువత తనపై ఎంతో ప్రేమను చూపించారని చెప్పారు. 155 దేశాల్లో తిరిగినా దక్కని ప్రేమ తనకు మునుగోడులో లభించిందని అన్నారు. ప్రచారం సమయంలో తనపై మూడు సార్లు దాడులకు యత్నించారని? రిటర్నింగ్ అధికారితో పాటు ఇతర అధికారులు తనను రక్షించారని చెప్పారు. ఎమ్మెల్యేల కొనుగోలు అంశం మొత్తం ఒక డ్రామా అని పాల్ అన్నారు. బీజేపీలో చేరితే తనకు మంత్రి పదవి ఇస్తానని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆఫర్ ఇచ్చారని చెప్పారు. బీజేపీ తనకు పరోక్షంగా మద్దతును ఇచ్చిందని, కాంగ్రెస్ నేరుగా మద్దతును ప్రకటించిందన్నారు.





ఆహ్వానం

చంద్రలత
నీలంపురాశి
భరిణలకెత్తుతూ... బండ్లకెత్తుతూ... ఓడలకెత్తుతూ...

నవల ఆవిష్కరణ సభ

సాయంకాలం 5-00 గం.లకు
ఆదివారం, 13 నవంబర్ 2022
ప్రభవ లో

ఆవిష్కర్త ఆచార్య జి.ఎం. సుందరవల్లి
వైస్ ఛాన్సలర్, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం, నెల్లూరు
ప్రత్యేక అతిథి డా. వి. ప్రసూన చంద్రశేఖర రావు, గుంటూరు
ఆత్మీయ అతిథులు విరపు బాలసుబ్రమణ్యం, ఎం.ఎల్.సి., నెల్లూరు
గుడిపూడి సుబ్బారావు, రైతు, రచయిత, అన్నారం, ఖమ్మం
విశ్వేశ్వరరావు, ప్రచురణకర్త, విజయవాడ
నవల పరిచయం డా. ఈమని శివనాగిరెడ్డి, స్థపతి, హైదరాబాద్
ఆచార్య మధురాంతకం నరేంద్ర, రచయిత, తిరుపతి
బండ్ల మాధవరావు, సంపాదకులు, కవితా! విజయవాడ
స్పందన చంద్రలత, రచయిత, ప్రభవ
నిర్వహణ ఆర్.ఎం. ఉమామహేశ్వరరావు, పాత్రికేయులు, రచయిత, తిరుపతి
ఆహ్వానం ఈతకోట సుబ్బారావు, సంపాదకులు, విశాలాక్షి, నెల్లూరు

# రాజేంద్రనగర్‌లో బైక్‌ను ఢీకొట్టిన లారీ.. వ్యక్తి మృతి

హైదరాబాద్, నవంబర్ 5:రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన రంగారెడ్డి జిల్లాలోని రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. హైదర్‌గూడ సమీపంలో పీవీ ఎక్స్ ప్రెస్ వే 159 పిల్లర్ వద్ద బైక్‌ను లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ చక్రాల కింద పడి శంషాబాద్‌కు చెందిన పానుగంటి నరేందర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# తీవ్ర అస్వస్థతకి గురయిన.. ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

అమరావతి: నవంబర్ 5:ఫుడ్ పాయిజన్ తో ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటీ విద్యార్థులు తీవ్ర అస్వస్థతకి గురయ్యారు. మెస్‌లో చపాతి తిన్న విద్యార్థులు అర్ధరాత్రి నుంచి వాంతులు, కడుపునొప్పితో అస్వస్థతకు గురయ్యారు. పదుల సంఖ్యలో విద్యార్థలు బాధపడుతున్నా సకాలంలో కళాశాల అధికారులు స్పందించకపోవడంతో బాధపడుతున్న విద్యార్థుల సంఖ్య రెట్టింపు అయ్యింది . అస్వస్థతకు గురైన విద్యార్థులను కొందరిని స్థానికంగా చికిత్స అందించగా మరికొందరిని శనివారం రిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. ఈ ఘటనపై అధికారులు విచారణ చేపట్టారు.

# గుజరాత్‌లో పోటీ నుంచి తప్పుకుంటే జైన్ విడుదల బీజేపీ ఆఫర్ చేసిందన్న కేజ్రీవాల్

న్యూఢిల్లీ, నవంబర్ 5:ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) చీఫ్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, బీజేపీపై సంచలన ఆరోపణలు చేశారు. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల పోటీ నుంచి తప్పుకుంటే జైల్లో ఉన్న ఆప్ మంత్రి సత్యేందర్ జైన్‌ను విడుదల చేస్తామని బీజేపీ ఆఫర్ ఇచ్చిందని విమర్శించారు. అయితే ఈ ప్రతిపాదన చేసిన వ్యక్తి పేరు చెప్పేందుకు ఆయన నిరాకరించారు. మీడియాతో శనివారం మాట్లాడిన అరవింద్ కేజ్రీవాల్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీపై మండిపడ్డారు. ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ చాలా ప్రయత్నాలు చేసిందని ఆరోపించారు. డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాకు ఎర వేసిందని తెలిపారు. ఆప్‌ను వీడి బీజేపీలో చేరితే సీఎం పదవి ఇస్తామని, కేసులన్నీ ఎత్తివేస్తామని సిసోడియాకు బీజేపీ ఆఫర్ ఇచ్చిందని చెప్పారు. అయితే బీజేపీ ఆఫర్‌ను కాదన్నందుకే లిక్కర్ స్కామ్‌తో ఆయనను వేధిస్తున్నారని అరవింద్ కేజ్రీవాల్ విమర్శించారు.

కాగా, బీజేపీ ఎప్పుడూ నేరుగా ఆప్ నేతలను సంప్రదించలేదని అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. స్నేహితులు, పరిచయస్తుల ద్వారా రాజకీయ నేతలను తమ పార్టీలోకి ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నదని విమర్శించారు. ఒకరి నుంచి మరొకరికి, వారి నుంచి మరో వ్యక్తికి, ఆపై స్నేహితులు, పరియస్తుల ద్వారా బీజేపీ ఆఫర్లు చేరుతాయని చెప్పారు. పంజాబ్‌లో మాదిరిగానే గుజరాత్‌లో కూడా ఆప్ ప్రభుత్వం ఏర్పడుతుందని అన్నారు.

# రైతాంగాన్ని మోసం చేస్తున్నది మోదీనే : మంత్రి ఎర్రబెల్లి

మహబూబాబాద్, నవంబర్ 5:(నేటినిజం ప్రతినిధి): రైతాంగాన్ని మోసం చేస్తున్నది ప్రధాని నరేంద్ర మోదీనే అని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మండిపడ్డారు. రైతులు లాభ పడాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ ముందుకు వెళ్తున్నారని మంత్రి స్పష్టం చేశారు. పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరు మండలం ఖానాపూర్ గ్రామంలో ప్రాథమిక రైతు సేవా సహకార సంస్థ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని దయాకర్ రావు ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై కక్ష కట్టిందని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ పరిపాలనతో అన్ని రంగాల్లో తెలంగాణ అభివృద్ధి చెందిందని చెప్పారు. రైతుబంధు, రైతుబీమా పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో ప్రతి ఎకరానికి నీళ్లు అందించిన మహాత్ముడు సీఎం కేసీఆర్ అని పేర్కొన్నారు. సాగు నీరు, 24 గంటల కరెంట్, రైతు బంధు లాంటి పథకాల అమలు వల్ల పంటలు బాగా పండిస్తున్నారు. దిగుబడి కూడా పెరిగిందన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను మన ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నదని తెలిపారు. పక్క రాష్ట్రాల రైతులు మన రాష్ట్రంలో పుట్టనందుకు బాధ పడుతున్నారని గుర్తు చేశారు. రాష్ట్రంలోని రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. సమస్యలు వస్తే వెంటనే వాటిని పరిష్కరించాలని సూచించారు.




# గతంలో ఎన్నడూ లేని విధంగా 141 గనుల అతిపెద్ద బొగ్గు గని వేలాన్ని ప్రారంభించిన ఆర్థిక మంత్రి




న్యూఢిల్లీ, నవంబర్ 5:భారతదేశం వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థకు బొగ్గు ఉత్పత్తి, గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులలో ఎక్కువ పెట్టుబడులు అవసరమని కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా, ఇంధన ధరలు ముఖ్యంగా గ్యాస్ ధరలు పెరుగుతున్నాయి. బొగ్గు మంత్రిత్వ శాఖ ఆరవ రౌండ్ బొగ్గు గని వేలాన్ని ఈ రోజు ఇక్కడ ప్రారంభించిన ఆర్థిక మంత్రి, భారతదేశం ప్రస్తుతం ప్రపంచంలో అత్యుత్తమ పెట్టుబడుల గమ్యస్థానంగా ఉందని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం విధాన స్థిరత్వం, పారదర్శకమైన ప్రక్రియ కారణంగా విద్యుత్ రంగానికి బొగ్గు దిగుమతులు 41% మేర తగ్గాయని మంత్రి వివరించారు. ఈ రోజు 141 బొగ్గు గనుల వేలం ద్వారా పన్నెండు రాష్ట్రాలు నేరుగా ప్రయోజనం పొందుతాయని ఆర్థిక మంత్రి చెప్పారు. బొగ్గు రంగాన్ని అన్ లాక్ చేసేందుకు ఇటీవల చేపట్టిన

కార్యక్రమాలకు గానూ బొగ్గు మంత్రిత్వ శాఖ ను అభినందించిన శ్రీమతి సీతారామన్, మైనింగ రంగసంస్కరణలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మన ఆర్థిక వ్యవస్థకు సరైన ఉత్తేజాన్ని కల్పిస్తున్నాయని అన్నారు. బొగ్గు గ్యాసిఫికేషన్, వాణిజ్య మైనింగ్ లో ప్రోత్సాహకాలకు ఆర్థిక మంత్రిత్వ శాఖ అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తుందని ఆమె తెలిపారు.

బొగ్గు, గనులు , పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి శ్రీ ప్రహ్లాద్ జోషి ప్రసంగిస్తూ, బొగ్గు వినియోగాన్ని పెంపొందించడానికి బొగ్గు మంత్రిత్వ శాఖ ప్రత్యామ్నాయ పద్ధతులను అన్వేషిస్తోందని అన్నారు. ఆర్థిక మంత్రిత్వశాఖ . బొగ్గు గ్యాసిఫికేషన్‌కు రు. 6000 కోట్ల ప్రోత్సాహకం అన్వేషణ ప్రక్రియ కోసం రు. 250 కోట్ల రూపాయలు అందించిందని శ్రీ జోషి తెలిపారు. ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద వేలంలో, ఈ రోజు పదకొండు రాష్ట్రాలకు సంబంధించిన 141 గనులను వేలం వేశారు. ఇంతకు ముందు వేలం వేసిన గనులు ఉత్పత్తిని ప్రారంభించాయని, వచ్చే ఏడాది నాటికి కొత్త గనుల నుండి 10 నుండి 15 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి అవుతుందని శ్రీ జోషి ఆశాభావం వ్యక్తం చేశారు. తాజాగా జరిగిన సమీక్ష ప్రకారం, బొగ్గు మంత్రిత్వ శాఖ ఈ ఏడాది 900 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని అంచనా వేస్తోందని శ్రీ జోషి తెలిపారు.

ఆరవ 6వ విడత వాణిజ్య వేలంలో 133 బొగ్గు గనులను వేలం వేయగా, వాటిలో 71 కొత్త బొగ్గు గనులు కాగా, 62 బొగ్గు గనులు మునుపటి విడతల వాణిజ్య వేలం నుంచి రోలింగ్ అవుతున్నాయి. అదనంగా, ఐదవ రౌండ్ వాణిజ్య వేలం రెండవ ప్రయత్నంలో ఎనిమిది బొగ్గు గనులు చేర్చబడ్డాయి, దీని కోసం మొదటి ప్రయత్నంలో సింగిల్ బిడ్లు వచ్చాయి. ఈ వేలంపాటను ప్రారంభించడం ద్వారా బొగ్గు మంత్రిత్వ శాఖ థర్మల్ బొగ్గు రంగంలో స్వయం సమృద్ధిని సాధించడానికి తన నిబద్ధతను పునరుద్ఘాటించింది.

సంరక్షిత ప్రాంతాలు, వన్యప్రాణుల అభయారణ్యాలు, కీలకమైన ఆవాసాలు, 40% కంటే ఎక్కువ అటవీ విస్తీర్ణం కలిగిన గనులు, భారీగా నిర్మించిన ప్రాంతం మొదలైనవి వేలం నుంచి మినహాయించబడ్డాయి. ఈ బొగ్గు బ్లాకుల్లో బిడ్డర్ల ఆసక్తి , భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి వాటాదారుల సంప్రదింపుల సమయంలో అందుకున్న సూచనలు, అభ్యంతరాలు ఆధారంగా దట్టమైన జనావాసాలు, అధిక గ్రీన్ కవర్ లేదా క్లిష్టమైన మౌలిక సదుపాయాలు మొదలైనవి ఉన్న కొన్ని బొగ్గు గనుల బ్లాక్ సరిహద్దులు సవరించబడ్డాయి. బొగ్గు/ లిగ్నైట్ కలిగిన జార్ఖండ్, చత్తీస్ గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, రాజస్థాన్, తమిళనాడు, బీహార్ రాష్ట్రాల్లో ఈ గనులను వేలం వేస్తున్నారు.

వేలం ప్రక్రియ లో పాటిస్తున్న కీలక అంశాలలో – ముందస్తు మొత్తం , బిడ్ సెక్యూరిటీ మొత్తాన్ని తగ్గించడం, పాక్షికంగా అన్వేషించబడిన బొగ్గు గనుల విషయంలో బొగ్గు గనిలోని కొంత భాగాన్ని వదులుకోవడానికి అనుమతి, జాతీయ బొగ్గు సూచిక , జాతీయ లిగ్నైట్ ఇండెక్స్ ను ప్రవేశపెట్టడం, ప్రవేశ అడ్డంకులు లేకుండా పాల్గొనే వీలు , బొగ్గు వినియోగంలో పూర్తి సౌలభ్యం, ఆప్టిమైజ్డ్ చెల్లింపు నిర్మాణాలు, ప్రారంభ ఉత్పత్తికి ప్రోత్సాహకాలు, బొగ్గు గ్యాసిఫికేషన్, శుభ్రమైన బొగ్గు సాంకేతిక పరిజ్ఞానాల వినియోగం. ప్రధానమైనవి.

టెండర్ డాక్యుమెంట్ల అమ్మకాలు నవంబర్ 03, 2022 నుంచి ప్రారంభమవుతాయి. గనులు, వేలం నిబంధనలు, టైమ్ లైన్ లు మొదలైన వాటి వివరాలను ఎం ఎస్ టి సి వేలం ప్లాట్ ఫారంపై యాక్సెస్ చేసుకోవచ్చు.

పర్సంటేజ్ రెవిన్యూ షేర్ ఆధారంగా పారదర్శకమైన రెండు దశల ప్రక్రియ ద్వారా వేలం ఆన్ లైన్ లో జరుగుతుంది. వాణిజ్య బొగ్గు గని వేలం కోసం బొగ్గు మంత్రిత్వ శాఖకు ఏకైక లావాదేవీ సలహాదారుగా ఉన్న ఎస్ బి ఐ క్యాపిటల్ మార్కెట్స్ లిమిటెడ్ ఈ పద్ధతిని రూపొందించింది. వేలం ప్రక్రియను నిర్వహించడంలో బొగ్గు మంత్రిత్వ శాఖకు సహాయం చేస్తోంది.

# బీజేపీ దొంగల పార్టీ.. చేసేది ప్రభుత్వాలను కూల్చే పని.. మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతి రాథోడ్ ఫైర్




మహబూబాబాద్, నవంబర్ 5:(నేటినిజం ప్రతినిధి): మహబూబాబాద్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గంలోని పలు మండలాల్లో ప్రాథమిక రైతు సేవా సహకార సంస్థ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వేర్వేరుగా ఆయా చోట్ల రాష్ట్ర గిరిజన సంక్షేమం, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి సత్యవతి రాథోడ్, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ పార్టీ దొంగల పార్టీ అని, ప్రభుత్వాలను కూల్చే పని పెట్టుకుందన్నారు. రైతాంగాన్ని, ప్రజలను మోసం చేస్తున్న పార్టీ బీజేపీ అన్నారు. కేంద్ర మంత్రులు అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ హయాంలోనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సాధించిందన్నారు. రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ ఇచ్చిన మహాత్ముడు సీఎం కేసీఆర్ అని, రైతు బంధు, రైతు బీమా పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఆడబిడ్డకు మేనమామ గా కళ్యాణాలక్ష్మి పథకం అందించడం జరుగుతుందన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అయిదు వందల పెన్షన్ కూడా రావడం లేదు అని, మన రాష్ట్రంలో 3 వేలా రూపాయల పెన్షన్ ఇచ్చిన గొప్ప వ్యక్తి సీఎం కేసీఆర్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో ప్రతి ఎకరానికి నీళ్లు అందించిన ఘనట కేసీఆర్ కే దక్కిందన్నారు.

సాగు నీరు, మంచినీరు, 24 గంటల కరెంట్, రైతు బంధు, రైతు బీమా వంటి పథకాలు పంటలు బాగా పండి, దిగుబడి పెరగడానికి కారణం సీఎం కేసీఆర్ అన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను మన ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నది, ప్రతి ఏటా 3 వేల కోట్లు నష్టం వచ్చినా భరిస్తూ కొనుగోలు చేస్తున్నామన్నారు. లట్టుంగాడు, పొట్టుంగాడు వచ్చి వరి వేయమన్నరు.. తీరా టైంకు చేతులు ఎత్తేసింద్రు అని, చేసేది లేక మళ్ళీ మన సీఎం కేసీఆర్ రే రైతులు నష్టపోవద్దని ధాన్యం కొంటున్నాడు అని గుర్తు చేశారు.

# చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు : ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



నర్సాపూర్, నవంబర్ 5: రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి తెలిపారు. శనివారం నర్సాపూర్ పట్టణంతో పాటు ఆయా గ్రామాల్లో ఏఎంసీ, పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో వరి పంట పండిందని తెలిపారు.

కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని వసతులు ఏర్పాటు చేశామని వెల్లడించారు. వడ్ల నిల్వలతో పాటు లారీల కొరత ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ధాన్యానికి సంబంధించిన డబ్బులను వెంటనే రైతుల ఖాతాలో వేస్తామని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి అవకతవకలు లేకుండా రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అనసూయ అశోక్‌గౌడ్, పీఏసీఎస్ ఛైర్మన్ రాజుయాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, వైస్‌ఎంపీపీ వెంకటనర్సింరావు, టీఆర్ఎస్ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

# శ్రీవాణి ట్రస్టు ద్వారా 320 భజన మందిరాల నిర్మాణం



తిరుమల, నవంబర్ 5: తిరుమల శ్రీవాణి ట్రస్టు ద్వారా వివిధ ప్రాంతాల్లో 320 భజన మందిరాలు నిర్మించనున్నట్టు టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి తెలిపారు. డిసెంబరు నాటికి 84 భజన మందిరాల నిర్మాణం పూర్తి అవుతుందన్నారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు, అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. సమరసత ఫౌండేషన్ నేతృత్వంలో రెండో విడత 111, మూడో విడతలో 209 భజన మందిరాల నిర్మాణపనులను అడిగి తెలుసుకున్నారు.

రెండో విడతకు సంబంధించి 84 భజన మందిరాల పనులు జరుగుతున్నాయని, మిగిలినవి డాక్యుమెంటేషన్ స్థితిలోనే ఉన్నాయని, వీటి పనులు వేగవంతం చేయాలని సూచించారు. మూడో విడతలోని 209 భజన మందిరాల స్థల సేకరణ పనులు పూర్తి చేసి వాటి నిర్మాణపనులు కూడా ప్రారంభించాలన్నారు.

రెండో విడతలో పూర్తికానున్న 111 భజన మందిరాలకు విగ్రహాలను సిద్ధం చేయాలని సీఈని ఆదేశించారు. వీటిలో అర్చకులుగా పనిచేయబోయేవారికి శ్వేతలో అర్చక శిక్షణ ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలన్నారు. వీటికి ధూపదీప నైవేద్యాల కోసం టీటీడీ సహకారం అందిస్తుందని చెప్పారు.

# బీహార్‌పై కేంద్రానిది పక్షపాత వైఖరి: బీహార్ డిప్యూటీ సీఎం

పట్నా, నవంబర్ 5: నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ సర్కారుపై బీహార్ ఉప ముఖ్యమంత్రి, ఆర్జేడీ అగ్ర నాయకుడు తేజస్వి యాదవ్ తీవ్ర విమర్శలు చేశారు. బీహార్‌పై కేంద్ర ప్రభుత్వం పక్షపాత వైఖరి అవలంభిస్తున్నదని ఆయన మండిపడ్డారు. మౌలిక సదుపాయాల అభివృద్ధిలో బీహార్ రాష్ట్రం ముందంజలో ఉన్నదని, దీనికితోడు కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా ఉండి ఉంటే రాష్ట్రానికి ప్రత్యేక హోదా వచ్చేదని వ్యాఖ్యానించారు. కేంద్రం సర్కారు బీహార్‌కు ప్రత్యేక హోదా ఇస్తే.. దేశంలోని టాప్ 5 రాష్ట్రాల్లో ఒకటిగా నిలిచేదని తేజస్వియాదవ్ అభిప్రాయపడ్డారు. కానీ నరేంద్రమోదీ సర్కారు పక్షపాత వైఖరితో బీహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వలేదని ఆరోపించారు.

# పాలమూరు పనుల్లో వేగం.. బీడు భూములకు సాగునీరు

హైదరాబాద్, నవంబర్ 5:నీళ్లే నినాదంగా, ప్రజల అకాంక్షలే లక్ష్యంగా సాగిన తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం కంకణ బద్ధమైంది. ఉత్తర తెలంగాణ లో కాళేశ్వరం నిర్మించి సాగు నీటి గోసను తీర్చిన సీఎం కేసీఆర్ దక్షిణ తెలంగాణలో వలసలతో విలవిల లాడుతున్న పాలమూరులో నోళ్లు తెరుచుకున్న బీడుభూముల దాహం తీర్చేందుకు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను వేగంచేశారు. అయితే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అవరోధాలు సృష్టించినా, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్లో కేసులున్నా వివాదాలు లేని మొదటి దశ పనులను పూర్తి చేసి డిసెంబర్ లో నీటిని విడుదల చేసేందుకు రాష్ట్ర నీటిపారుదల శాఖ పనుల్లో వేగం పెంచింది. ఇప్పటికే 70 శాతం పనులు పూర్తి చేసింది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ప్రతినిధుల బృందం పర్యవేక్షణ అనంతరం పనుల్లో మరింత వేగం పెంచి రెండవ దశ నీటిని 20023 యాసంగి నాటికి విడుదల చేసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లుతుంది. పర్యావరణ అనుమతులకోసం ప్రజాభిప్రాయాలను సేకరించడంతో పాటుగా కేంద్ర అటవీ శాఖ నుంచి మొదటి,రెండవ దశ అనుమతులు ఈ ప్రాజెక్టుకు లభించాయి. అయితే కృష్ణా నదీ వరదనీటిని ఈ ప్రాజెక్టుకు వినియోగించుకోవడాన్ని జీర్ణించుకోలేక అంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుతో ఆంధ్ర,తెలంగాణ రాష్ట్రాల్లో పర్యావరణానికి ముప్పువాటిల్లుతుందని కేసు వేయడంతో పనుల్లో కొంత మేరకు జాప్యం జరిగింది. అయితే పర్యావరణ పరిరక్షణకోసం తీసుకుంటున్న చర్యల నివేదికను తెలంగాణ అడ్వకేట్ జనరల్ గ్రీన్ ట్రిబ్యునల్ కు సమర్పించడంతో పాటుగా కోరిన సమయం అనుమతులు పొందారు. త్వరలో జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ప్రతినిధుల బృందం పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పరిసరాలను పరిశీలించేందుకు రానుందని అధికారులు చెప్పారు.

పర్యావరణానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కేంద్ర ప్రభుత్వం అటవీశాఖ అనుమతులు ఇచ్చినప్పటికీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ కు ఫిర్యాదు చేయడంతో ఈ ప్రాజెక్టు ద్వారా ఎలాంటి పర్యావరణ నష్టాలు లేవని తెలంగాణ ప్రభుత్వం వాదిస్తుంది. పర్యావరణానికి నష్టం వాటిళ్లకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లకోసం పక్కా ప్రణాళికలను సిద్ధం చేసింది. రూ. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో 14వేల 891 కుటుంబాలకు పునరావసం కల్పించేందుకు నిధులు కేటాయించింది. సహాయ పునరావాసంకోసం రూ. 1566.86 కోట్లు, గ్రీన్ బెల్ట్ అభివృద్ధి కోసం రూ. 29.64 కోట్లు, వ్యర్థాల నిర్వహణ కోసం రూ. 71. 25 కోట్లు, స్థానిక, ప్రాంత సమస్యల పరిష్కారానికి 30.35 కోట్లు, ఆయకట్టు అభివృద్ధికి రూ. 1321 కోట్లు, ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో పాల్గొనే 7వేల మంది సంక్షేమానికి నిధులను తెలంగాణ ప్రభుత్వం కేటాయించింది. సముద్ర మట్టానికి 269.735 మీటర్ల ఎత్తులో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు కు 13వేల 92 హెక్టార్ల భూమి అవసరం అయింది. అయితే ఈ స్థలాల్లో పురాతన కట్టడాలు, వన్యప్రాణీ సంరక్షణ కేంద్రాలు, ప్రత్యేకజాతుల పక్షులు, జంతువులు లేక పోవడంతో పర్యావరణానికి ఎలాంటి నష్టం వాటిల్లదనీ, ప్రాజెక్టు పూర్తి అయితే పర్యావరణం మరింత అభివృద్ధి చెందతుందని రాష్ట్ర ప్రభుత్వం నివేదికల్లో స్పష్టం చేసింది.

పూర్తిఅవుతున్న రిజర్వాయర్ల నిర్మాణాలు

తెలంగాణ ఆవిర్భవించగానే సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ సాగునీటి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. జూన11 2015 న భూత్ పూర్ మండలం కరివెన దగ్గర సీఎం కేసీఆర్ పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారు. తాగు, సాగు, పారిశ్రామిక అవసరాలకోసం మహబూబ్ నగర్, వికారాబాద్, రంగారెడ్డి, నల్గొండజిల్లాల కు లబ్ది చేకూర్చేవిధంగా రూ. 56వేల కోట్ల రూపాయల పరిపాన అనుమతులతో ప్రాజెక్టునిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకు రూ. 20 వేల కోట్ల రూపాయల పనులు జరిగాయి. నాగర్ కర్నూలు జిల్లాకొల్లాపూర్ మండలం లోని ఎల్లూరు దగ్గర శ్రీశైలం వరదనీటిని తోడి ప్రాజెక్టుల్లో నింపడం ప్రదాన నీటి వనరు. వర్షాకాలంలోని 60 రోజులు రోజుకు 1.5 టీఎంసీ నీటిని తోడి ప్రాజెక్టుల్లోకి పంపిస్తారు. ఈనీటిని ఐదు అంచల్లో ఎత్తిపోస్తారు.

ప్రస్తుతం మొదటి దశపనుల్లోనిర్మిస్తున్న ఐదు జలాశయాల పనులు చివరిదశకు చేరుకున్నాయి. డిసెంబర్ లో నీటిని విడుదల చేయాలనే లక్ష్యం తో పనులు జరిగాయి. నార్లాపూర్ దగ్గర రిజర్వాయర్ నిర్మించి 6.647కిలోమీటర్ల వరదకాలువ నిర్మాణ పనులు దాదాపుగా పూర్తి కావచ్చాయి. ఈ రిజర్వాయర్ 7.95 టిఎంసీల నీటినినిల్వచేసే అవకాశం ఉంది. అలాగే 5.91 టీఎంసీల సామర్థ్యంతో ఏదుల దగ్గర వీరాంజనేయ జలాశయం, 14.47 టీఎంసీల సామర్థ్యంతో వట్టెం దగ్గర వెంకటాద్రి జలాశయం, కరివెన దగ్గర 16.9 టీఎంంసీల సామర్థ్యంతో కురుమూర్తిరాయ జలాశయం, ఉద్దంపూర్ దగ్గర 15.61 టీఎంసీల సామర్థ్యంతో ఉద్దంపూర్ జలాశయం నిర్మాణ పనులు చివరిదశకు వచ్చాయి. వీటికి సంబంధించిన కాలువల పనులు జరుగుతున్నాయి. అలాగే నీటి తరలించేందుకు పంపుహౌజ్లు, పైపులైన్లు, కాలువలు, సొరంగాల పనులు వేగంగా జరుగుతున్నాయి.



# దేశానికి అన్నం పెట్టే ధాన్యాగారంగా తెలంగాణ : మంత్రి హరీశ్‌రావు



సిద్దిపేట , నవంబర్ 5:దేశానికి అన్నం పెట్టే ధాన్యాగారంగా తెలంగాణ మారిందని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు అన్నారు. నంగునూరు మండలం సిద్దన్నపేట మార్కెట్‌యార్డులో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌తో కలిసి హరీశ్‌రావు ప్రారంభించారు.

ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లాలో 5 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. క్వింటాల్‌కు రూ. 2,060 గా నిర్ణయించామని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన రెండు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని చెప్పారు. ఎఫ్‌సీఐ నుంచి రావాల్సిన డబ్బులు రాకున్నా.. తెలంగాణ రాష్ట్రం వరి ధాన్యం కొంటుందన్నారు. గతంలో ఎప్పుడు కూడా ఇంత పంట పండలేదన్నారు. వడ్లు కొనమంటే బీజేపీకి చేతకాదు కానీ.. రూ. 100ల కోట్లు పెట్టి ఎమ్మెల్యేలను కొంటోందని మండిపడ్డారు. ఆయిల్ పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలన్నారు. ఈ సాగు లాభదాయకంగా ఉంటుందని మంత్రి హరీశ్‌రావు చెప్పారు.

# స్వాముల భిక్షలో ఎమ్మెల్యే



ఖమ్మం, నవంబర్ 5: (నేటినిజం ప్రతినిధి): కల్లూరు మండల కేంద్రం వ్యవసాయ మార్కెట్లో ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు, భవాని స్వాములకు, హనుమాన్ భక్తులకు భిక్ష (అన్నదాన) కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సండ్ర మాట్లాడుతూ... అయ్యప్ప, భవానీ స్వాములకు భక్తులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అభగవంతుల ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కాంక్షించారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, భవానీ స్వాములు, హనుమాన్ స్వాములు మరియు స్థానిక, వివిధ మండలాల ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# కోర్టు కేసుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి



ఖమ్మం, నవంబర్ 5: (నేటినిజం ప్రతినిధి): కోర్టు కేసుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. శనివారం కలెక్టరేట్ లోని ప్రజ్ఞ సమావేశ మందిరంలో అధికారులతో పెండింగ్ కోర్టు కేసులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కోర్టు కేసుల సత్వర పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు.

వివిధ శాఖలకు సంబంధించి 62 టైం బాండ్ కేసులు, 79 డైరెక్షన్స్, 11 ధిక్కార, 323 రిట్ పిటిషన్స్ ఉన్నట్లు ఆయన తెలిపారు. సరైన 2 కౌంటర్లు ఫైల్ చేయాలన్నారు. ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. టైం బాండ్ కేసులపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ధరణి లో దరఖాస్తుదారులు వారి వారి సమస్యలు ఏ ఏ మాడ్యూల్స్ లో దరఖాస్తు చేసుకోవాలో అవగాహన కల్పించాలన్నారు. కేసుల పరిష్కారం పై వారం వారం సమీక్ష చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు స్నేహాలత మొగిలి, ఎన్. మధుసూదన్, డిఆర్వో శిరీష, ఆర్డీవోలు రవీంద్రనాథ్, సూర్యనారాయణ, జెడ్పి సిఇఓ అప్పారావు, డిపివో హరిప్రసాద్, డిఇఓ యాదయ్య, డిఆర్డీవో విద్యాచందన, ఏడి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ రాము, జిల్లా వైద్య, ఆరోగ్యాధికారిణి డా. మాలతి, జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేందర్, జిల్లా మత్స్య అధికారి ఆంజనేయ స్వామి, ఆర్ అండ్ బి ఇఇ శ్యామ్ ప్రసాద్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.






# సంపదను సృష్టించి పేదలకు పంచాలన్నదే కేసీఆర్ లక్ష్యం : మంత్రి గంగుల



కరీంనగర్, నవంబర్ 5 (నేటినిజం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాన్ని పెంచి, వచ్చిన సంపదను పేదలకు పంచాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమని రాష్ట్ర బీసీ సంక్షేమ పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు.

శనివారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో కరీంనగర్ అర్బన్, కొత్తపల్లి మండలాలకు చెందిన 142 మంది కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు రూ. కోటి 42 లక్షల 16,472 లను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నాక నాణ్యమైన ఉచిత విద్యుత్, సాగునీరు, రైతుబంధుతోపాటు అనేక గొప్ప పథకాలు కేసీఆర్ అమలు చేస్తున్నారని అన్నారు. గతంలో ఏ రాష్ట్ర ప్రభుత్వనీ నిరుపేదింటి ఆడబిడ్డల వివాహాలకు అండగా నిలవాలనే ఆలోచన రాలేదన్నారు. స్వయంపాలన లో కేసీఆర్ అన్నగా, మేనమామగా నిరుపేద ఇంటి ఆడబిడ్డలకు అండగా ఉంటానని కల్యాణ లక్ష్మి , షాదీముబారక్ పథకాన్ని చేపట్టారన్నారు.

పేద ఆడబిడ్డ పెళ్లయిన నెల రోజుల్లోనే చెక్కులు అందిస్తున్నామని పేర్కొన్నారు. కేసీఆర్ కిట్ తో ఉచితంగా కాన్పులు, ఉన్నత వర్గాలకు ధీటుగా మహాత్మా జ్యోతిబాఫూలే గురుకులాల్లో ప్రతి విద్యార్థికి సంవత్సరానికిరూ. 1. 25 లక్షలు వెచ్చించి నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు.

కార్యక్రమంలో ఆర్డీవో ఆనంద్ కుమార్, ఎంపీపీలు తిప్పర్తి లక్ష్మయ్య, పిల్లి శ్రీలత, కొత్తపెల్లి మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు, జడ్పీటీసీలు,కార్పొరేటర్లు, సర్పంచులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# పాలేరులో సభ్యత్వ నమోదు కార్యక్రమం

**- ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు భరోసా**

**- జర్నలిస్టుల పక్షపాతి టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ**



ఖమ్మం, నవంబర్ 5: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ ఆధ్వర్యంలోనే జర్నలిస్టులకు భరోసా ఉందని టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ అన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఏర్పడిన టి.యూ.డబ్ల్యూజే (టి.జే.ఎఫ్) ఎప్పటికీ జర్నలిస్టుల పక్షపాతేనని అన్నారు. శనివారం కూసుమంచిలోని ఎస్.ఆర్.ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన పాలేరు డివిజన్ స్థాయి సభ్యత్వ నమోదు, కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ గా అల్లం నారాయణ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి జర్నలిస్టుల సంక్షేమం కోసం పని చేస్తున్నారని చెప్పారు

. కరోనా విపత్తు సమయంలో వేల మంది బాధిత జర్నలిస్టులకు రూ. 20 వేల ఆర్థిక సహాయం అందించిన ఘనత తమ సంఘానికే దక్కిందన్నారు. జర్నలిస్టులకు ఎప్పుడు ఏ విధమైన సమస్య ఎదురైనా పరిష్కారం దిశగా పోరాడే పటిమగల నాయకత్వం జిల్లా కమిటీ లో ఉందన్నారు. కొత్త అక్రిడేషన్ కార్డుల జారీలో జరిగిన జాప్యం పై పోరాడుతున్నామని, చిన్న పత్రికలకు అక్రిడేషన్ కార్డుల కోసం ఐ అండ్ పీఆర్ ఆఫీస్ ముందు ధర్నా చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తమ సంఘం పేరు చెబితేనే కొన్ని సంఘాల నాయకులు భయపడుతూ ఉలిక్కిపడుతున్నారని, జర్నలిస్టు సంఘాల పేరుతో వసూళ్లు చేయడం, విహారయాత్రలు చేయడం పరిపాటిగా మారిందన్నారు. సంఘాల పేరుతో చందాలు వసూలు చేసి పబ్బం కడుపుకోవడం కొందరికి ఆనవాయితీగా మారిందని విమర్శించారు. అటువంటి వ్యక్తుల వల్ల జర్నలిస్టు సమాజానికి కలంకం వాటిల్లుతుందన్నారు. ఈ సందర్భంగా పలు సంఘాలకు చెందిన కొందరు నాయకులు సభ్యత్వం తీసుకున్నారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలకు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ లు పెద్ద సంఖ్యలో హాజరవడం హర్షించదగ్గ విషయమని, సంఘం పటిష్టతకు ఇదే నిదర్శనం అన్నారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులకు సభ్యత్వం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు విజేత, ప్రశాంత్ రెడ్డి, చిత్రా రవి, శెట్టి రజినికాంత్, రంజిత్, ఏ ఉపేందర్, సంతోష్, కర్ణ, సుందర్, పసలాది సత్యనారాయణ, హనుమంత్ రెడ్డి, నరసింహారావు, వేణు, రాము, టి హనుమంతరావు, లక్ష్మణ్, సకినవీటి అరుణ్ కుమార్, అచ్యుత రామారావు, శ్రీనివాస్ రెడ్డి, మామిడి ప్రవీణ్, యం మోహన్, సునీల్ లతో పాటుగా పలు మండలాల విలేఖర్లు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన మంత్రి

**-65 మందికి గాను రూ.25.65 లక్షల విలువైన చెక్కులు పంపిణీ**

**- నేటి వరకు 3808 చెక్కులకు గాను రూ.16.11 కోట్లు పంపిణీ**

ఖమ్మం, నవంబర్ 5: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం నియోజవకర్గ పరిధిలో వివిధ చికిత్సలు అనంతరం మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) చెక్కులను ఆయా లబ్దిదారులకు రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ స్వయంగా అందజేశారు. శనివారం వీడియోస్ కాలనీ లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సిఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు.



వివిధ వ్యాధి, బాధలతో అనారోగ్యం పాలై అత్యవసర చికిత్స అనంతరం వారికి సహాయార్థం సీఎం సహాయనిధి పథకం కింద మంజూరైన 65-మంది లబ్దిదారులకు గాను రూ.25.65లక్షల విలువైన చెక్కుల ద్వారా ఆర్థిక సాయం మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. గడచిన ఎనిమిది ఏళ్లలో నేటి వరకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 3808 చెక్కులకు గాను రూ.16.11 కోట్ల రూపాయలను పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు.

పేదరికంతో బాధపడుతూ అనారోగ్యాల బారిన పడుతున్న వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించటం ద్వారా ప్రభుత్వం ఆయా కుటుంబాలకు భరోసాగా నిలుస్తున్నదన్నారు. ముందస్తు (ఎల్వోసి), చికిత్సల అనంతరం (సిఎంఆర్ఎఫ్) చెక్కుల ప్రక్రియ నా క్యాంపు కార్యాలయంలో నిత్యం కొనసాగుతుందన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఏ ఒక్క పేద కుటుంబం చికిత్సల అనంతరం ఆర్థికంగా చితికిపోకుండా వారికి సిఎంఆర్ఎఫ్ ద్వారా స్వాంతన కలిగిస్తోందన్నారు.

పేదలకు ఇప్పటికే కార్పొరేట్ కి ధీటుగా ప్రభుత్వ వైద్యం అందిస్తున్నామని గర్వంగా చెప్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లు పసుమర్తి రాంమోహన్, తెరాస నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, పైడిపల్లి సత్యనారాయణ, వీరునాయక్, తదితర నాయకులు ఉన్నారు.

# టీడీ వ్యాక్సినేషన్‌కు జిల్లా టాస్క్‌ఫోర్స్ సమావేశం

ఖమ్మం, నవంబర్ 5: (నేటినిజం ప్రతినిధి): ధనుర్వాతం, కంఠసర్ప (డిఫ్తీరియా) వ్యాధుల నుండి పిల్లలను రక్షించుటకు ఈ నెల 7 నుండి 19 వరకు టి.డి. (టెటనస్ అండ్ డిఫ్తీరియా) టీకా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. శనివారం కలెక్టరేట్ లోని ప్రజ్ఞ సమావేశ మందిరంలో టిడి వ్యాక్సినేషన్ కు సంబంధించి జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ధనుర్వాతం రాకుండా గతంలో టెటనస్ టీకా ఇచ్చేవారమని కానీ డిఫ్తీరియా తో పిల్లలు బాధపడుచున్నారని గుర్తించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ 2017 నుండి టెటనస్ స్థానములో టి.డి. వ్యాక్సిన్ ను ఇస్తున్నారని అన్నారు. ఈ నెల 7 నుండి 19 వరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని ఆయన అన్నారు. జిల్లాలో 10 మరియు 16 సంవత్సరాల వయసున్న పిల్లలు 43219 మందిని గుర్తించినట్లు ఆయన అన్నారు. జిల్లాలో 1405 ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు ఉన్నట్లు, ఇందులో 5వ తరగతి, 10 వ తరగతి చదువుచున్న విద్యార్థులకు టీకా ఇవ్వనున్నామని ఆయన తెలిపారు. బడిబయట ఉన్న పిల్లలు 527 మందిని గుర్తించినట్లు, వీరికి టీకాలు ఇచ్చుటకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు ఆయన అన్నారు. జిల్లాలో ఉన్న 385 మంది ఏఎన్ఎం లతో టీకాలు ఇచ్చేందుకు కార్యాచరణ చేయనున్నట్లు ఆయన తెలిపారు. పల్లె, బస్తీ దవాఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు వారి వారి పరిధిలో వ్యాక్సినేషన్ పర్యవేక్షణ చేయాలన్నారు. 5, 10 వ తరగతి పిల్లలందరు వంద శాతం టిడి టీకా తీసుకునేలా అవగాహన కలిగించాలని, టీకా ఇచ్చేందుకు ప్రత్యేక గదిని ఏర్పాటు చేయాలని అన్నారు. లైన్ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ, ప్రత్యేక డ్రైవ్ ను విజయవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు.




ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్. మధుసూదన్, జిల్లా వైద్య ఆరోగ్యాధికారిణి డా. మాలతి, జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాధికారి యాదయ్య, జిల్లా ఇమ్యూనైజషన్ అధికారిణి డా. ప్రమీల, జిల్లా సంక్షేమ అధికారిణి సంధ్యారాణి, డిఆర్డీవో విద్యాచందన, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కృష్ణా నాయక్, జిల్లా సాంఘీక సంక్షేమ అధికారి సత్యనారాయణ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.










# మార్కెట్ నిర్మాణ పనులు పరిశీలించిన పువ్వాడ



ఖమ్మం, నవంబర్ 5: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం నగర ప్రజల సౌకర్యార్థం కూరగాయలు, పండ్లు, మాంసాహారం, చేపలు తదితరుల నిత్యావసర వస్తువులు అన్ని ఒకే చోట అందుబాటులో ఉండాలన్న సంకల్పంతో రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అందుకు తగు చర్యలు చేపట్టారు. ఖమ్మం నగరం దినదినాభివృద్ధి చెందుతున్న తరుణంలో ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సమీకృత వెజ్, నాన్‌వెజ్‌మార్కెట్‌ను ఆధునాతనంగా నిర్మించనున్నారు. ఖమ్మం నగరంలోని ఖానాపురంలో రూ. 4.50 కోట్లు, వీడిఓస్ కాలనీలో రూ. 4.50 కోట్లతో నిర్మించ తలపెట్టిన సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణ పనులను బుధవారం మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మేయర్ పునుకొల్లు నీరజతో కలిసి పరిశీలించారు. వీడిఓస్ కాలనీ లో గల 2.01ఎకరాల్లో నిర్మిస్తున్న సమీకృత వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్ లో 65-వెజ్ స్టాల్స్, 23-ఫ్రూట్ స్టాల్స్, 46-నాన్-వెజ్ స్టాల్స్ మొత్తం-134 స్టాల్స్ తో అన్ని సౌకర్యాలు ఒకే చోట ప్రజలకు కావలసినవి అందుబాటులో ఉండనున్నాయని మంత్రి పువ్వాడ పేర్కొన్నారు. ఆయా నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభికి, సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. ఇప్పటికే చాలా ఆలస్యంగా అయిందని పనుల్లో వేగం పెంచాలని అన్నారు. మార్కెట్ నిర్మాణ పనుల్లో జాప్యం లేకుండా చూడలని, ఈ సందర్భంగా మార్కెట్ ప్లాన్ మ్యాప్‌ను మంత్రి పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, ఏంఈ పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, డిఈ స్వరూప రాణి, ఏఈ నవ్యజ్యోతి, కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, నాయకులు పగడాల నాగరాజు, బత్తుల మురళి ఉన్నారు.

## ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

## - జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 5: (నేటినిజం ప్రతినిధి): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు .

శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ ,సివిల్ పోలీస్ సిబ్బందికి వీక్లీ పరేడ్ నిర్వహించడం జరిగింది. ఈ పరేడ్ కి జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే హాజరై గౌరవ వందనం స్వీకరించి తరువాత సిబ్బంది ప్రదర్శించిన ఆర్మ్స్ డ్రిల్, ఫుట్ డ్రిల్, లాఠీ డ్రిల్, ట్రాఫిక్ డ్రిల్,సిబ్బంది ప్రదర్శనని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మమాట్లాడుతూ ప్రతిరోజు ఉదయాన్నే కనీసం ఒక అరగంట యోగ, ధ్యానం, నడక ఏదోఒకటిచేయాలని,సాధ్యమైనంత వరకు బయట ఆహారం తినడం మానివేయాలని. రెగ్యులర్ గా హెల్త్ చెకప్ చేసుకోవాలని ఎస్పీ తెలిపారు. వీక్లీ పరేడ్ వల్ల సిబ్బందికిక్రమశిక్షణ,యూనిటీగా ఉండడం, ఫిజికల్ ఫిట్నెస్ కి ఉపయోగపడుతుందన్నారు. క్రమశిక్షణ తో డ్యూటీలు నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందేలాగా పనిచేస్తూ పోలీస్ శాఖకి, జిల్లా కి మంచి పేరు తెచ్చే లాగా పని చేయాలని సిబ్బంది కి ఎలాంటి సమస్యలు ఉన్నా సర్వీస్ కి సంబంధించి సమస్యలు ఉన్నా హెచ్ ఆర్ ఎమ్ ఎస్ లోని గ్రీవేన్స్ ద్వారా తమ దృష్టికి తీసుకరవలని సమస్యల పరిష్కరనికి కృషి చేస్తామని అన్నారు.. ఈ పరేడ్ లో అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ విశ్వప్రసాద్,

ఆర్.ఐ లు రజినీకాంత్, యాదగిరి, సి.ఐ లు అనిల్ కుమార్, ఉపేంద్, ఎస్.ఐ లు ఆర్.ఎస్.ఐ లు,ఆర్మ్డ్ సిబ్బంది, సివిల్ సిబ్బంది పాల్గొన్నారు...

## హైకోర్టు న్యాయమూర్తులను సన్మానించిన న్యాయవాదులు



ఖమ్మం, నవంబర్ 5: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులుగా ఇటీవల నియమితులైన జస్టిస్ భీమపాక నగేష్, జస్టిస్ బొమ్మినేని సుధీర్ కుమార్, జస్టిస్ ఖాజా శరత్ లను న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. ఈ ముగ్గురు న్యాయమూర్తులు ఉమ్మడి ఖమ్మం జిల్లా వారు కాగా, అదే జిల్లాకు చెంది హైకోర్టులో ప్రాక్టీసు చేస్తున్న పలువురు సీనియర్ న్యాయవాదులు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలు కప్పి సత్కారం చేశారు. హైదరాబాద్ నగరంలోని వనస్థలిపురం జింకల పార్కులో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో స్టేట్ బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ, బొమ్మెర రాంమూర్తి, గుండ్లపల్లి శేషగిరిరావు, రవి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు

## డెంటల్ ప్రపంచంలో తనదైన ముద్రను చూపిన స్మైలిస్ట్ గ్లోబల్ యొక్క మొట్టమొదటి అంతర్జాతీయ సదస్సు



హైదరాబాద్, నవంబర్ 5: ప్రపంచవ్యాప్తంగా దంత వైద్యుల వద్దకు వినూత్నమైన స్మైలిస్ట్ (గాఎఎశ్రీతిబబి)నేపథ్యం తీసుకువచ్చిన బహుళజాతి కంపెనీ స్మైలిస్ట్, గ్లోబల్ డెంటిస్ట్రీకి సంబంధించి తమ మొట్టమొదటి అంతర్జాతీయ సదస్సును నేడు నిర్వహించింది.

ఈ సదస్సుకు స్మైలిస్ట్ నేపథ్యపు సృష్టికర్త మరియు ఇన్నోవేటర్ డాక్టర్ మరియా సిల్లాగ్ నేతృత్వం వహించారు. దీనికి అంతర్జాతీయ ఫ్యాకల్టీ, స్మైలిస్ట్ మాస్టర్స్ మరియు ఇండియన్ ఫ్యాకల్టీ మద్దతు అందించారు.

ఇండియన్ డెంటల్ అసోసియేషన్ (దక్కన్ శాఖ), ప్రపంచ వ్యాప్తంగా సర్టిఫైడ్ ట్రైనర్లు స్మైలిస్ట్ నేపథ్యం అందిస్తోన్న విస్తృతశ్రేణి అవకాశాలను వెల్లడించారు. పలు పరిమితులను గురించి చెప్పడంతో పాటుగా డెంటిషన్ మరియు శరీరంలోని పలు వ్యవస్థల మధ్య ఉన్న సంబంధం పట్ల స్ఫష్టమైన సంబంధం అందించారు.

ఈ విప్లవాత్మక నే పథ్యం, పలు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు అందించే ప్రయోజనాలను సైతం ఈ సదస్సులో వెల్లడించారు. కొన్ని వినూత్నమైన కేసులతో పాటుగా టేబుల్ క్లీనిక్స్‌ను సైతం సమర్పించడం వల్ల ఈ సదస్సులో పాల్గొన్న డాక్టర్లు తమ డెంటిస్ట్రీ నైపుణ్యం గణనీయంగా మెరుగుపరుచుకున్నారు మరియు ఈ రెండు రోజుల సదస్సులో విస్తృతస్థాయిలో విజ్ఞాన మార్పిడి సైతం జరిగింది.

స్మైలిస్ట్ యొక్క థెరపాటిక్ ప్రయోజనాలను గురించి డాక్టర్ మరియా సిల్లాగ్ మాట్లాడుతూ "దీనియొక్క వినూత్నమైన ఫేసియల్ ఎనలిటిక్ పద్ధతి మరియు డయాగ్నోస్టిక్ పరికరాలతో స్మైలిస్ట్ కాన్సెప్ట్ ఇప్పుడు డెంటిస్ట్రీ పరిధిని మరింతగా విస్తరించే సామర్థ్యం కలిగి ఉంది.

ఈ విప్లవాత్మక విధానాన్ని అంతర్జాతీయ స్థాయిలో ప్రదర్శించే అవకాశం లభించడం సంతోషంగా ఉంది.

దీనితో ప్రపంచం నలుమూలలా చిరునవ్వును విస్తరించనున్నాము" అని అన్నారు.

స్మైలిస్ట్ భవిష్యత్ గురించి స్మైలిస్ట్ డైరెక్టర్ డాక్టర్ అజయ్ కక్కర్ మాట్లాడుతూ "విస్తృతస్థాయిలో ఈ కాన్సెప్ట్ పట్ల పరిశోధనలు చేసిన తరువాత స్మైలిస్ట్ అత్యద్భుతమైన డయాగ్నోస్టిక్ టూల్స్‌ను అందిస్తుంది. దంత వైద్యుల నడుమ ఈ డాటాను విస్తృతస్థాయిలో ప్రచారం చేయడానికి ఓ బృందం పనిచేస్తుంది" అని అన్నారు.

మార్కెటింగ్ కోణంలో స్మైలిస్ట్ డైరెక్టర్ అంగిరా ఆర్య మాట్లాడుతూ "ప్రపంచ వ్యాప్తంగా డెంటిస్ట్‌లకు నూతన సాంకేతికతల పట్ల అవగాహన పెంచుకోవడం మరియు దంత సౌందర్యం గురించిన జ్ఞానాన్ని ఉపయోగించుకోవడానికి అపూర్వ అవకాశంగా స్మైలిస్ట్ సదస్సు నిలిచింది" అని అన్నారు.

## పర్యటనను ప్రోత్సహించడం కోసం 'సీమ దర్శన్'

న్యూఢిల్లీ, నవంబర్ 5:పర్యటనను ప్రోత్సహించడం కోసం సీమ దర్శన్' లో భాగం గా నడాబెట్ ను మరియు ఇతర సరిహద్దు ప్రాంతాల ను సందర్శించండి అంటూ పౌరుల కు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ విజ్ఞప్తి చేశారు.

పర్యటన, సంస్కృతి మరియు భారతదేశం లో ఈశాన్య ప్రాంతాల అభివృద్ధి శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి చేసిన ఒక ట్వీట్ కు ప్రధాన మంత్రి సమాధానాన్ని ఇస్తూ,

"సీమ దర్శన్ ప్రాజెక్టు పర్యటన రంగానికి ఒక కొత్త పార్శ్వాన్ని జతపరుస్తుంది. అది సరిహద్దు లో ఉంటున్న వారి దృఢత్వాన్ని ప్రశంసించే అవకాశాన్ని ఇస్తుంది.

నడాబెట్ ను మరియు అన్య సీమావర్తి క్షేత్రాల ను మీరంతా సందర్శించాలి అని మిమ్మల్ని నేను కోరుతున్నాను.. " అని పేర్కొన్నారు.

## ఊరి వేసుకొని వృద్ధుడు ఆత్మహత్య



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 5: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ రూరల్ మండలం వట్టెంల గ్రామానికి చెందిన మ్యాకల ఎల్లయ్య (84) అనే వృద్ధుడు జీవితం మీద విరక్తి చెంది ఊరి వేసుకొని చనిపోయాడు అని కూతురు కనుకవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సబ్ ఇన్స్పెక్టర్ నాగరాజు తెలిపారు.

వివరాలు ప్రకారం ఎల్లయ్య కు ఇద్దరు కుమారులు ఒక కుమార్తె కలరు, గత సంవత్సరం ఎల్లయ్య భార్య మరణించినది గత ఆరు నెలల క్రితం ఎల్లయ్య కుడి కాలు విరిగి ఇబ్బంది పడుతున్నాడు.

ఒంటరి జీవితం మరియు ఆరోగ్య సమస్యల కారణం గా శనివారం తన మేకల దొడ్డి లో వాసానికి డోతి తో ఉరి వేసుకొని మరణించినాడు.

## ఆధ్య గోలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 12 తేదీన జాబ్ మేళా

### -అధ్య గోలి ఫౌండేషన్ చైర్మన్ గోలి మోహన్



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 5: (నేటినిజం ప్రతినిధి): అధ్య గోలీ పౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12 వ తేదీన శనివారం వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిరుద్యోగ యువత కోసం ఉచిత జాబ్ మేళాను నిర్వహించనున్నామని ఆధ్య గోలి ఫౌండేషన్ చైర్మన్ గోలి మోహన్ తెలిపారు నవంబర్ 12 తేదీన శనివారం మెగా జాబ్ మేళాల్లో భాగంగా శుక్రవారం శనివారం వేములవాడనియోజకవర్గంలోని పలు గ్రామాల ను గోలి మోహన్ సందర్శించి యువతతో మోహన్ మావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవతరగతి ఉత్తీర్ణులై ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్, ఎంటెక్, ఫార్మసీ విద్యార్హతలు కలిగిన నిరుద్యోగులకు ఈ జాబ్ మేళాలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుంది. దాదాపు 180కి పైగా మల్టీ నేషనల్ ప్రైవేటు కంపెనీల కు చెందిన ప్రతినిధులు విచ్చేసి ఈ జాబ్ మేళాలో ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నారు. ఈ వేళాలో కల్పించనున్నారు. నెలకు కనీసం 11000 వేల నుండి 35000 వేల వరకురూపాయల వేతనం వరకు ఇందులో ఎంపికైన ఉద్యోగులకు వేతనాలు చెల్లించబడును. దాదాపు 1000 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ జాబ్ మేళా ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు కొనసాగుతుంది.

## ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరాలు



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 5: (నేటినిజం ప్రతినిధి): ప్రతిమ వైద్య విజ్ఞాన సంస్థ నగునూర్ కరీంనగర్ ఆధ్వర్యంలో శనివారం రోజున కోనరావుపేట మండలంలోని నిజామాబాద్ గ్రామ పంచాయతీ ఆవరణలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని డాక్టర్ చెన్నమనేని వికాస్ , డాక్టర్ దీప ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ" అందరి భాగస్వామ్యంతోనే గ్రామ అభివృద్ధి సాధ్యమౌతుందని, కరోనా వంటి విపత్కర సమయంలో రైతులు చేసిన కృషి ఎనలేనిదని, దేశానికి అన్నం పెట్టిన రైతన్నలకు అండగా ప్రతిమ ఫౌండేషన్ నిలుస్తుందని మరియు ఇది వరకే కొనరావు పేట మండల కేంద్రానికి మరియు మర్రిమడ్ల గ్రామం లో ఉచిత అంబులెన్స్ లని ఇవ్వడం జరిగింది అన్నారు. ఇదే కాకుండా మహిళ సాదికారత కొరకై ప్రతిమ ఫౌండేషన్ పెద్ద పీట వేస్తుందన్నారు. ప్రతిమ ఫౌండేషన్ ద్వార కుట్టు మిషన్లు మరియు స్వయం ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. యువత కోసం ప్రతిమ ఫౌండేషన్ ద్వారా నైపణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసి ఎంతో మంది యువతకు ఉపాధి కల్పించడం జరిగింది అన్నారు. ఈ క్యాంపు లో 633 మంది ఓపి చూడగా సాధారణ జబ్బులు, రక్త పరీక్షలు,మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ పరీక్ష (మమ్మోగ్రాఫి ) , గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించిన పరీక్షలు మరియు ఎక్సరే పరీక్షలు ఉచితంగానిర్వహించి 363 మందికి పలు రకాల వైద్య పరీక్షలు ఆరోగ్య రథం ద్వారా అందించడం జరిగింది. తదుపరి వైద్య పరీక్షల కోసం 63 మందిని ప్రతిమ ఆసుపత్రి కీ రిఫర్ చేయడం జరిగింది.

అనంతరం డాక్టర్ చెన్నమనేని వికాస్ మరియు డాక్టర్ దీప నిజామాబాద్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థినిలకు మరియు నిజామాబాద్ గ్రామ మహిళలకు, యువతులకు ఉచిత సానిటరీ పాడ్స్ మూడు నెలలకు సరిపడ అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కేతిరెడ్డి అరుణ - జగన్ మోహన్ రెడ్డి , ఉప సర్పంచ్ మల్లేశం, వార్డ్ సభ్యులు ,గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు , మహిళా సంఘం సభ్యులు ప్రతిమ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

జలజం సాహిత్య సమాలోచన సభ



6 నవంబర్, 2022
లిటిల్ స్కాలర్స్ స్కూల్
మేనేజమెంట్ స్టాఫ్ & స్టూడెంట్స్

సాహిత్య శిఖరం 'జలజం సత్యనారాయణ' గారి గౌరవార్థం జరిగే సమాలోచన సభకు సాహిత్యాభిమానులు, ఆత్మీయులు హాజరు కావాల్సిందిగా మేము సాదరంగా ఆహ్వానం పలుకుతున్నాం.

ముఖ్య అతిథి :
డా॥ వి. శ్రీనివాస్ గౌడ్ గారు
తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, అబ్కారీ శాఖ మంత్రి

కాళోజీ మరియు జలజం చిత్రపట ఆవిష్కరణ
Also Launching Little Scholars Literature Magazine

వేదిక :
కాళోజీ హాల్, లిటిల్ స్కాలర్స్ స్కూల్,
మారుతీ షోరూం వెనుక, మెట్టుగడ్డ, మహబూబ్‌నగర్ - 509 001.
సెల్ : 9849444944

సభా సమయం
ఉదయం 10 :00 గం॥ల నుండి సాయంత్రం 6:00 గం॥ల వరకు

భోజన విరామం
మధ్యాహ్నం 1:00 గం॥లకు
ఇండోర్ స్టేడియం, లిటిల్ స్కాలర్స్ స్కూల్.

'కురుక్షేత్ర' పుస్తకావిష్కరణ
ఆవిష్కర్త, ముఖ్య అతిథి : శ్రీ జూలూరి గౌరీ శంకర్ గారు
అంకితం : శ్రీ నాతి మల్లికార్జున్ రావుగారు, శ్రీమతి నాతి సుభద్రమ్మ గారు
విశిష్ట అతిథి : శ్రీమతి స్వర్ణ సుధాకర్ రెడ్డి గారు
సభాధ్యక్షులు : శ్రీ కె. లక్ష్మణ్ గౌడ్ గారు
ప్రధాన వక్తలు : డాక్టర్ ఎస్. రఘు గారు - 'అనల'
: డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్ గారు - 'వేదన'
: శ్రీ కోట్ల వెంకటేశ్వర రెడ్డి గారు - 'శిఖరం'

టీ విరామం


'ప్రేమలహరి' పుస్తకావిష్కరణ
ఆవిష్కర్త, ముఖ్య అతిథి : శ్రీ ఆచార్య ఎల్లూరి శివారెడ్డి గారు
అంకితం : శ్రీ మణికొండ వేద కుమార్ గారు
తెలంగాణ రిసోర్స్ సెంటర్ వ్యవస్థాపకులు మరియు చైర్మన్
ఆత్మీయ అతిథి : డాక్టర్ జె. చెన్నయ్య గారు
సభాధ్యక్షులు : శ్రీ వి. మనోహర్ రెడ్డి గారు
ప్రధాన వక్తలు : శ్రీ డాక్టర్ యాకూబ్ గారు - 'కబీర్ గీత'
: శ్రీ ఎం. నారాయణ శర్మ గారు - 'శృంగార జిల్లేనియం'
: శ్రీ డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి గారు - 'ఫైజ్ కవిత్వం'

భోజన విరామం

పాలపిట్ట విశిష్ట సంచిక ఆవిష్కరణ
ఆవిష్కర్త, ముఖ్య అతిథి : శ్రీ గోరేటి వెంకన్న గారు (MLC)
ప్రముఖ ప్రజాకవి, గాయకుడు
విశిష్ట అతిథి : శ్రీ బుర్రా వెంకట్రామి రెడ్డి గారు
సభాధ్యక్షులు : శ్రీ గుడిపాటి గారు
ప్రధాన వక్తలు : శ్రీ భీంపల్లి శ్రీకాంత్ గారు - 'ప్రేమలహరి'
: శ్రీ రూప్ కుమార్ గారు - 'ఇప్పపూలు'
: శ్రీ లక్ష్మీ చక్రవర్తి గారు - 'కురుక్షేత్ర'
: శ్రీ కె.పి. అశోక్ కుమార్ గారు - 'ధ్వని'

టీ విరామం

'అనువాద శిఖరం - జలజం' పుస్తకావిష్కరణ
ఆవిష్కర్త, ముఖ్య అతిథి : శ్రీ ఆచార్య బన్న ఐలయ్య గారు ప్రధానాచార్యులు ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.
సభాధ్యక్షులు : శ్రీ మామిడి హరికృష్ణ గారు



వందన సమర్పణ
జలజం కుటుంబం

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com.